మా కలం.. మీ గళం..
# మన గళం
దిన పత్రిక
RNI : APTEL/ 2017/74310

## మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి



3 లో..

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర | సంపుటి : 08 | సంచిక : 163 | మంగళవారం | 09 - 12 - 2025 | పేజీలు: 8 | వెల: 4

### వందే భారత్ స్లీపర్
# వచ్చేస్తోంది..!



మన గళం, న్యూఢిల్లీ : భారతీయ రైల్వే దేశవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా వందే భారత్ రైళ్లను తీసుకువచ్చింది. దేశవ్యాప్తంగా వివిధ నగరాల మధ్య ఈ సెమీ హైస్పీడ్ రైళ్లు దూసుకెళ్తున్నాయి. త్వరలోనే వందే భారత్ స్లీపర్ వెర్షన్‌ను సైతం పట్టాలెక్కించబోతున్నది. ఈ రైలు సుదూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులకు సరికొత్త అనుభూతిని అందించను న్నాయి. తేజస్ రైలు తరహాలో వేగంగా.. రాజధాని రైలు లాంటి సౌకర్యాలు కలిగిన తొలిరైలు ఢిల్లీ-పాట్నా మార్గంలో 2 లో..



### రాష్ట్ర భవిష్యత్తు కోసం
# భారీ లక్ష్యాలు

- తెలంగాణను దేశంలో ముందునుంచే రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న సీఎం సంకల్పం

మన గళం, హైదరాబాద్ : తెలంగాణను దేశంలో ముందంజలో నిలపాలన్న లక్ష్యంతో తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ప్రవేశపెట్టినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీలో 2 లో..

### ఇప్పుడు వందేమాతరంపై
# చర్చ దేనికి..?



- లోక్‌సభలో వందేమాతరం పై ప్రత్యేక చర్చ
- రాజకీయ లక్ష్యాల కోసం చర్చ అంటూ విమర్శలు
- 'మేం ప్రజల కోసం పోరాడతాం' - ప్రియాంకాగాంధీ

మన గళం, న్యూఢిల్లీ : దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు అవుతున్నప్పటికీ, వందేమాతరం గేయంపై ఇప్పుడు చర్చ చేపట్టడం వెనుక అసలు ఉద్దేశ్యం ఏమిటని కాంగ్రెస్ అగ్రనాయిక, 2 లో..

## విశాఖ ఉక్కును అదానీకి అప్పగించే కుట్ర జరుగుతోంది : వైఎస్ షర్మిల

- "అమ్మేది లేదన్న మాటలన్నీ మోసం.. ఆంధ్రుల హక్కు ఉరితీయబడుతోంది"
- కేంద్రం, రాష్ట్రం కలిసి నిర్వహిస్తున్న 'సైలెంట్ కిల్లింగ్' అని ఆరోపణ







విశాఖపట్నం, డిసెంబర్ 8 మనగళం,: విశాఖ ఉక్కు ప్లాంట్‌ను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, "అమ్మేది లేదని చెప్పి లోపల అదానీకి అప్పగించే కుట్ర చేయడం బీజేపీ ప్రభుత్వానికి సిగ్గు" అని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా విమర్శించారు. విశాఖ ఉక్కు 2 లో..

# సొంత నిధులతో కాపు, బీసీ భవనాల నిర్మాణానికి కృషి





- ☐ కర్నూలులో ట్రాఫిక్ సమస్యలకు చర్యలు తీసుకుంటున్నాం
- ☐ పరిశ్రమలు,వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్

మనగళం, కర్నూలు సిటీ : సొంత నిధులతో కాపు, బీసీ భవనాల నిర్మాణాలను పూర్తి చేయటానికి కృషి చేస్తున్నామని పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం కర్నూలు పట్టణ బి - కాంప్ లో ముందుగా కాపు భవనం, బీసీ భవనాల పునః నిర్మాణానికి మంత్రి టి.జి. భరత్ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2014 కాలంలో ఉన్న అప్పటి తెలుగుదేశ ప్రభుత్వం కాపు , బీసీ భవనాలు నిర్మాణానికి చర్యలు చేపట్టినదని, నిధులు కేటాయించి నిర్మాణాలు బేస్ లెవెల్ స్థాయికి తీసుకొని రావటం జరిగిందని గుర్తు చేశారు. 2019 సంవత్సరం తర్వాత వచ్చిన ప్రభుత్వం ఈ పనులను అర్ధాంతరంగా ఆపివేయడం, నిధులు కేటాయించకపోవడంతో కాపు , బీసీ ల మనోభావాలు దెబ్బతిన్నవని తెలిపారు. 2024 ఎన్నికల సమయంలో ప్రచారానికి ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు ఈ ప్రాంతంలో దట్టమైన చెట్లపొదలు, గుంతలతో ఉన్నదని అప్పుడే వారికి ఈ రెండు భవనాలు పూర్తి చేసే చర్యలు తీసుకుంటామని వాగ్దానం చేయడం జరిగిందన్నారు. ఆ వాగ్దానం మేరకు ఇప్పుడు కాపు భవన నిర్మాణ నిమిత్తం ఒక కోటి 50 లక్షల రూపాయలు, బి.సి. భవనానికి 2 కోట్ల రూపాయలు టీజీవి సంస్థల

# బాలల సంక్షేమానికి కృషి



- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ



- విద్యార్థుల ప్రతిభను ప్రశంసిస్తూ అవగాహన కార్యక్రమాలు

మనగళం, కర్నూలు సిటీ : బాలల సంక్షేమం, విద్యా ప్రమాణాల మెరుగుదల కు కృషి చేస్తున్నాం అని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శ్రీమతి డాక్టర్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ మంగళవారం పెద్దపాడు లో దామోదరం సంజీవయ్య బాల సదనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులు, వసతి గృహ అధ్యాపకులు చైర్‌పర్సన్‌కు ఘన స్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా బాల్యవివాహాల నివారణ అంశంపై విద్యార్థులు ప్రదర్శించిన నాటిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చైర్‌పర్సన్ విద్యార్థుల ప్రతిభను ప్రశంసిస్తూ, ఇలాంటి అవగాహన కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పుకు దోహద పడతాయని పేర్కొన్నారు. తదనంతరం 2 లో..

## విధ్వంసమైన ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెడుతున్నాం



- ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, డిసెంబర్ 8 మనగళం,: ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ గత కొంతకాలంగా తీవ్రంగా దెబ్బతిన్నప్పటికీ, ప్రస్తుతం దీన్ని తిరిగి గాడిలో పెట్టే చర్యలు జరుగుతున్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అభివృద్ధి చర్యలపై వివరాలు వెల్లడించారు.

గత పాలకులు కక్షపూరిత రాజకీయాలతో రాష్ట్రానికి భారీ ఆర్థిక నష్టం కలిగించారని, ప్రజాధనాన్ని వృథా చేశారని 2 లో..


## వందే భారత్ స్లీపర్ వచ్చేస్తోంది..!

నడువనున్నది. డిసెంబర్ చివరి నాటికి ఈ రైలు రాకపోకలు సాగించే అవకాశాలున్నాయి. ఈ రైలు ప్రారంభోత్సవానికి సంబంధించిన పనులన్నీ తుది దశలో ఉన్నాయి. ఈ రైలును ప్రారంభోత్సవం కోసం ప్రయాణికులు సైతం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నివేదిక ప్రకారం.. బెంగళూరులోని బీఈఎంఎల్, భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో తయారవుతున్న ఈ వందే భారత్ స్లీపర్ రెండు రేక్‌లలో ఒకటి ఇప్పటికే పూర్తయ్యింది. తొలి రేక్ డిసెంబర్ 12న ఉత్తర రైల్వేకు బయలుదేరుతుంది. ఆ తర్వాత ఢిల్లీ–పాట్నా మార్గంలో ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. ఈ రైలులో 16 కోచ్‌లు 827 బెర్త్‌లో ఉంటాయి. ఇందులో 611 థర్డ్ ఏసీ, 188 సెకండ్ ఏసీ, 24 ఫస్ట్ ఏసీ బెర్తులు ఉంటాయి. ఈ రైలును అత్యాధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దారు. రైలులో ఆటోమేటిక్ డోర్లు, బయో టాయిలెట్స్, సీసీటీవీ కెమెరాలు, వ్యక్తిగత రీడింగ్ లైట్లు, ప్రీమియం క్వాలిటీతో సౌకర్యవంతమైన ఇంటీరియర్ ఉంటుంది. ఈ రైలు గంటకు గరిష్టంగా 160 కిలోమీటర్ల వేగంతో నడిచేలా రూపొందించారు. ఇందులో కవచ్ సిస్టమ్, క్రాష్ రెసిస్టెంట్ స్ట్రక్చర్ వంటి అధునాతన భద్రత టెక్నాలజీ అమర్చారు. అవసరమైతే కోచ్ సంఖ్యను 24కు పెంచనున్నారు. ఢిల్లీ–రాజేంద్రనగర్ మార్గంలో తేజస్ మార్గంలో నడపాలని రైల్వేశాఖ నిర్ణయించింది. వారంలో ఆరు రోజులు రాకపోకలు సాగిస్తుంది. రైలు సాయంత్రం పట్నా రాజేంద్రనగర్ టెర్మినల్ నుంచి సాయంత్రం బయలుదేరి ఉదయం ఢిల్లీకి చేరుకుంటుంది. తిరిగి తేజస్ రైలు తరహాలోనే నడుస్తుంది. నెలాఖరు నాటికి వందే భారత్ స్లీపర్ రైలును రెగ్యులర్‌గా నడిపేందుకు సన్నాహాలు చేస్తున్నట్లుగా దానాపూర్ డివిజన్ ధ్రువీకరించింది.

## బాలల సంక్షేమానికి కృషి

వసతి గృహంలోని డైనింగ్ హాల్, వంటగది, స్టోర్ రూమ్, విద్యార్థుల పడక గదులను పరిశీలించి అందిస్తున్న సదుపాయాలపై సమగ్రంగా ఆరాతీశారు. విద్యార్థులతో మాట్లాడి, ప్రభుత్వం అందిస్తున్న వసతులు, భోజనం, చదువు, పాఠశాల వాతావరణం వంటి అంశాలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ బాల సదనాల్లో విద్యతో పాటు బాలల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోందన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ ల గురించి అవగాహన కల్పిస్తూ పిల్లలు బయటి ప్రపంచంలో ఎలా మెలగాల, అత్యవసర పరిస్థితుల్లో పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలి అని అవగాహన కల్పించడం జరుగుతోందని తెలిపారు. బాల సదనం లో వసతుల కల్పన కోసం కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని, పిల్లలు బాగా చదువుకోవాలని, ధైర్యంగా జీవించాలని ఆమె సూచించారు. వసతి గృహ నిర్వహణపై సంబంధిత అధికారులకు తగు సూచనలు చేస్తూ, పిల్లల శ్రేయస్సును ప్రాధాన్యంగా తీసుకుని, బాగా చూసుకోవాలని ఆమె సూచించారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ, బాల సదనం లో 48 మంది పిల్లలు ఉన్నారని, వీరికి మెరుగైన వసతులను కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. బాల్య వివాహాలు చేయకూడదని, ఈ మేరకు తల్లిదండ్రులకు, పిల్లలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. సమాజంలో ఆత్మవిశ్వాసంతో, ధైర్యంగా జీవించేలా ఆడపిల్లలకు చైతన్యం తీసుకురావాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ రీజనల్ డైరెక్టర్ రోహిణి, ఐసిడిఎస్ పిడి విజయ తదితరులు పాల్గొన్నారు.

## విధ్వంసమైన ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెడుతున్నాం



చంద్రబాబు విమర్శించారు. అన్ని వ్యవస్థలు నిర్వీర్యం కావడంతో అభివృద్ధి నిలిచిపోయిందని, ప్రస్తుతం వాటిని ఒక్కొక్కటిగా బలోపేతం చేస్తూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు. పాలనలో పారదర్శకత, ఆర్థిక క్రమశిక్షణను అమలు చేయడం ద్వారా ఆర్థిక వ్యవస్థను బలపరుస్తున్నట్లు వివరించారు. విద్యుత్ చార్జీల పెంపుదలపై స్పష్టతనిచ్చిన సీఎం, ప్రజలపై అదనపు భారం వేయే అవకాశం లేదని అన్నారు. సాగునీటి వ్యవస్థలో ఉన్న లోపాలను సరిదిద్దుతూ, నీటి వినియోగం సమర్థవంతంగా ఉండేలా పునర్వ్యవస్థీకరణ చేపట్టినట్లు వెల్లడించారు. రైతులు, వ్యవసాయ రంగం ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొనకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై కూడా సీఎం వ్యాఖ్యానిస్తూ, గతంలో నిర్వీర్యమైన పథకాలను తిరిగి సక్రమంగా అమలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధిలో కేంద్ర పథకాల పాత్ర కీలకమని, అవి నిలిచిపోయినప్పుడు ప్రజలకు నష్టం జరిగిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఏపీ బ్రాండ్‌ను పునరుద్ధరించడం ప్రస్తుతం ప్రభుత్వానికి ప్రధాన ప్రాధాన్యమని, పెట్టుబడులను ఆకర్షించేందుకు భారీ ప్రయత్నాలు చేస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు. పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం, పరిశ్రమలకు మౌలిక సదుపాయాలు, పారదర్శక విధానాలు అందుబాటులో ఉంటే ఆంధ్రప్రదేశ్ మళ్లీ అభివృద్ధి హబ్‌గా ఎదగగలదని విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర వృద్ధిరేటు పునరుద్ధరణ ప్రారంభమైన సమయంలో, ప్రభుత్వ చర్యలు ప్రజల్లో ఆశావాదాన్ని పెంచుతున్నాయని, ఉత్తమ పాలనతో ఆర్థిక పునర్నిర్మాణం సాధ్యమవుతుందని ఆయన ధృవీకరించారు.

# రాష్ట్ర భవిష్యత్తు కోసం భారీ లక్ష్యాలు



ప్రారంభమైన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ తొలి రోజు సదస్సులో సీఎం మాట్లాడుతూ, భవిష్యత్తు కోసం నిర్ణయించిన ఆర్థిక, సామాజిక లక్ష్యాలను నిపుణులు, మేధావులు, పారిశ్రామికవేత్తలతో పంచుకున్నారు. 2047 నాటికి ప్రపంచంలో అత్యుత్తమ రాష్ట్రంగా తెలంగాణను మార్చాలని ప్రభుత్వం సంకల్పించిందని వెల్లడించారు. రాష్ట్ర ప్రజలు, నిపుణులు, పెట్టుబడిదారులు కలిసి ఈ ప్రయాణంలో భాగస్వామ్యం కావాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. తెలంగాణను సేవా రంగం, తయారీ రంగం, వ్యవసాయ రంగం అనే మూడు ప్రధాన విభాగాలుగా విభజించి అభివృద్ధి ప్రణాళిక రూపొందించినట్లు ఆయన తెలిపారు. వీటిని వరుసగా కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ, పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ, గ్రామీణ వ్యవసాయ రీజియన్ ఎకానమీ అనే మండళ్లుగా అమలు చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఈ లక్ష్యాల సాధనలో ప్రజల అభిప్రాయాలు, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగ సూచనలు, ఐఎస్బీ, నీతి ఆయోగ్ నిపుణుల పరిశోధనలు కీలక పాత్ర పోషించాయని సీఎం చెప్పారు. తెలంగాణ భవిష్యత్తు రూపకల్పనలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.

రాష్ట్ర ఆర్థిక ప్రగతికి స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించినట్లు తెలియజేసిన సీఎం, 2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని వెల్లడించారు. దేశ జీడీపీలో ప్రస్తుతం 5% వాటా అందిస్తున్న తెలంగాణ, భవిష్యత్తులో 10% వాటా సాధించడం ద్వారా జాతీయ అభివృద్ధికి ప్రముఖంగా సహకరించాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. చైనా గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్ అభివృద్ధి ఉదాహరణగా తీసుకుని, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, సింగపూర్ మోడళ్లను అధ్యయనం చేసి తెలంగాణ అభివృద్ధి వ్యూహం రూపొందించినట్లు పేర్కొన్నారు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత ఇప్పుడు ప్రపంచ స్థాయి పెట్టుబడులకు కేంద్రంగా ఎదిగే శక్తి రాష్ట్రానికి ఉందని సీఎం అన్నారు. పెట్టుబడిదారుల కోసం అనుకూల వాతావరణం, అవకాశాలు సమృద్ధిగా ఉన్నాయని, తెలంగాణను అభివృద్ధి దిశగా నడిపేందుకు ప్రపంచవ్యాప్తంగా సహకారం కోరుతున్నామని తెలిపారు. తెలంగాణ రైజింగ్ విజన్ కష్టసాధ్యంగా కనిపించినప్పటికీ దాన్ని సాధించగల సామర్థ్యం, ధైర్యం రాష్ట్రానికి ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రణాళికలకు ప్రజలు, నిపుణులు, పెట్టుబడిదారులు తోడైతే తెలంగాణ లక్ష్యాలను అధిగమించి ముందుకు సాగుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఇప్పుడు వందేమాతరంపై చర్చ దేనికి..?

వాయనాడ్ ఎంపీ ప్రియాంకాగాంధీ ప్రశ్నించారు. వందేమాతరానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా లోక్‌సభలో జరిగిన చర్చలో పాల్గొని ఆమె కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ చర్చ వెనుక రెండు ప్రధాన రాజకీయ కారణాలున్నాయని ప్రియాంకాగాంధీ పేర్కొన్నారు. అందులో మొదటిది వచ్చే ఏడాది జరగనున్న బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకోవడమేనని, రెండోది దేశ ప్రజల దృష్టిని ప్రస్తుత సమస్యల నుండి, భవిష్యత్తు అవకాశాల నుండి దూరంగా మళ్లించి, గతంపై నిలిపివేయడం కోసమని అన్నారు. ప్రధాని మోదీ ప్రసంగం మంచి పదజాలంతో ఉన్నప్పటికీ, వాస్తవాలను ప్రస్తావించడంలో బలహీనంగా ఉన్నారని ఆమె అభిప్రాయపడ్డారు. 'మీరు ఎన్నికల కోసం పనిచేస్తుంటే మేం దేశ ప్రజల కోసం పనిచేస్తున్నాం' అని బీజేపీని ఉద్దేశించి ప్రియాంకాగాంధీ అన్నారు. ఎన్ని ఎన్నికలు ఓడిపోయినా, ప్రజల కోసం, వారి హక్కుల కోసం పోరాడటమే తమ లక్ష్యమని తెలిపారు. బీజేపీ సిద్ధాంతాలపై తమ పోరాటం కొనసాగుతుందని, దాన్ని ఆపే శక్తి ఎవరికీ లేదని స్పష్టం చేశారు. దేశ ప్రయోజనం కోసం పోరాడే బాధ్యత తమదేనని, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం, ప్రతిఘటన చేయడం అవసరమని ప్రియాంకాగాంధీ వ్యాఖ్యానించారు. ప్రజల కోసం తాము చేస్తున్న పోరాటాన్ని ఎలాంటి రాజకీయ ఒత్తిడులు ఆపలేవని ఆమె స్పష్టం చేశారు.

## సొంత నిధులతో కాపు, బీసీ భవనాల నిర్మాణానికి కృషి



ద్వారా కేటాయించి ఎనిమిది నెలల్లో కాంట్రాక్టర్ ప్రభాకర్ ద్వారా నాణ్యతతో కూడిన పనులతో పార్కింగ్ ప్రదేశం తో సహా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి టి.జి తెలియజేశారు. సీఎం చంద్రబాబు కెప్టెన్ గా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ను అభివృద్ధి వైపు తీసుకెళు_న్నారని తెలియజేశారు. మంత్రులుగా మేము కేంద్ర ప్రభుత్వ మంత్రులతో సమావేశాలు నిర్వహించుకుని రాష్ట్రానికి చేయవలసిన అభివృద్ధికి తీవ్రమైన కృషి చేస్తున్నామని తెలిపారు. ఓర్వకల్ ఇండస్ట్రియల్ హబ్ కు ఇప్పటివరకు పదివేల కోట్ల రూపాయల పెట్టుబడులు తీసుకొని రావడం జరిగిందని, 7వేల కోట్ల రూపాయలతో అగస్త్య కంపెనీ వస్తూ ఉన్నదని, ప్రపంచంలోనే అతిపెద్ద రెండవ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ రిలయన్స్ కంపెనీ ద్వారా తీసుకుని రావడం జరిగిందని , ఇంకా చాలా కంపెనీలు తీసుకుని వస్తామని మంత్రి తెలిపారు. కాపు భవనం పూర్తి అయిన తర్వాత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో ప్రారంభోత్సవం చేయిస్తామని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలుగుదేశం ప్రభుత్వం ఎక్కువ కాలం అధికారంలో ఉండడం వలన హైదరాబాద్ అన్ని విధాల గణనీయమైన అభివృద్ధి చెంది ఇప్పుడు దేశానికే తలమానికంగా ఉన్నదని తెలియజేశారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి స్థిరమైన ఎక్కువ కాలం ఉండే ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని, ఆ విధంగా స్థిరమైన ప్రభుత్వాలు ఉండడం వల్లనే సింగపూర్, జపాన్, దుబాయి దేశాలు, గుజరాత్ వంటి రాష్ట్రాం అభివృద్ధి చెందాయని తెలుపారు. కర్నూలు పట్టణంలో రోడ్లను అభివృద్ధి చేస్తూ అవసరమైన ప్రదేశాల్లో రోడ్డు వెడల్పు చేస్తూ ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించే చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న సేవలు గుర్తుంచుకుని, ప్రభుత్వానికి అన్ని విధాలుగా ఎల్లప్పుడు అండగా ఉండి ఆశీస్సులు అందించాలని కోరారు. కార్యక్రమాల్లో కాపు, బలిజ నాయకులు నారాయణరెడ్డి, డాక్టర్ కుళ్లాయప్ప, పత్తి ఓబులయ్య, లక్ష్మన్న, రవి, రామకృష్ణ, సోమశేఖర్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు చింతామోహన్, ఆర్కిటెక్ట్ రఘునాథ రెడ్డి, బీసీ నాయకులు అడ్వకేట్ శ్రీధర్, నక్కమిట్టల శ్రీనివాసులు, రాంబాబు, రామకృష్ణ, బీసన్న, బీసీ వెల్ఫేర్ అధికారిని ప్రసూన, బీసీ కార్పొరేషన్ ఈడీ జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ ఉక్కును అదానీకి అప్పగించే కుట్ర జరుగుతోంది : వైఎస్ షర్మిల

ఆంధ్రుల గర్వం, హక్కు అని పేర్కొంటూ, దాన్ని అమ్మేయడానికి జరుగుతున్న ప్రయత్నాలను ఏ విధంగానూ అంగీకరించబోమని ఆమె స్పష్టం చేశారు.

అమ్మేది లేదంటూ ప్రజలను మోసం చేస్తూనే, ప్లాంట్‌కు సంబంధించిన భూములు, వనరులు విభజించి కార్పొరేట్ సంస్థలకు అప్పగించే స్కెచ్ తయారు చేస్తున్నట్లు షర్మిల పేర్కొన్నారు. ఉద్యోగులను తప్పించడం, కొత్త నియామకాలను నిలిపివేయడం, ఉత్పత్తిని నిలిపివేసేలా ముడి సరుకులు ఇవ్వకపోవడం అన్నీ ముందుగా ప్లాంట్ విలువ తగ్గించేందుకు చేస్తున్న చర్యలేనని ఆమె ఆరోపించారు. "విశాఖ ఉక్కును మోసం చేసి, నెమ్మదిగా ఉక్కిరిబిక్కిరి చేసి, చివరికి అమ్మేయడం 'ఆపరేషన్ సైలెంట్ కిల్లింగ్'" అంటూ షర్మిల వ్యాఖ్యానించారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాత్ర ఉన్నట్లు షర్మిల విమర్శించారు. "ఒక చేత్తో సాయం అన్నట్టు చెప్పి, మరో చేత్తో గుంజుకోవడం బీజేపీ%–%టిడిపీ డబుల్ గేమ్" అని ఆమె అన్నారు. కేంద్రం, రాష్ట్రం కలిసి కార్పొరేట్ ప్రయోజనాల కోసం ప్లాంట్‌ను తాకట్టు పెడుతున్నారని, ఇలాంటి చర్యలు తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని అవమానిస్తున్నాయని ఆమె పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వాన్ని ధిక్కరిస్తూ, ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా స్పష్టమైన ప్రకటన చేయాలని షర్మిల డిమాండ్ చేశారు. "విశాఖ స్టీల్‌ను అమ్మేది లేదని ప్రజల ముందే ప్రధాని ప్రకటించాలి. ప్లాంట్‌కు స్వంతంగా గనులను కేటాయించాలి. అవసరమైతే %బాూ×బూ%లో విలీనం చేయాలి" అని ఆమె అన్నారు. రాష్ట్ర ఎంపీలు కూడా ఈ విషయంలో ధైర్యం, బాధ్యత చూపాలని ఆమె కోరారు.

"విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు. దాన్ని అమ్మడానికి చేసే ప్రయత్నాలు ప్రజాస్వామ్యానికి, తెలుగు ప్రజలకు అవమానం. ఈ పోరాటంలో ప్రజల మద్దతు మా బలం" అని షర్మిల తెలిపారు.

విశాఖ స్టీల్ అంశం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మళ్లీ వేడెక్కుతున్న నేపథ్యంలో, కేంద్రం తీసుకోబోయే నిర్ణయం పై ఆసక్తి నెలకొంది.

## కామన్ సర్వీస్ సెంటర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే



మనగళం, కర్నూలు అర్బన్ : కల్లూరు అర్బన్ 37 వ వార్డ్ సింగిల్ ట్యాంకు నందు "పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ( మెప్మ) ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన డీజీ–లక్ష్మీ కామన్ సర్వీస్ సెంటర్ ను సోమవారం పాణ్యశీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమం లో విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కే పార్వతమ్మ, నియోజవర్గం తెలుగు యువత అధ్యక్షుడు జవ్వాజీ గంగాధర్ గౌడ్, క్లస్టర్ ఇంచార్జీ జనార్ధన్ ఆచారి,రాష్ట బీసీ సెల్ కార్యదర్శి కాసాని మహేష్ గౌడ్, నాగేశ్వర రావు, ఖాదర్, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హలో యువత మేలుకో... పోస్టర్లు ఆవిష్కరణ




మనగళం, కర్నూలు క్రైం : హలో యువత మేలుకో చెడు వ్యసనాల నుండి నిన్ను నువ్వు కాపాడుకో నినాదంతో అయ్యప్ప రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ముద్రించిన వాల్ పోస్టర్లను సోమవారం కర్నూలు జిల్లా అదనపు ఎస్పీ హుస్సేన్ పీరా ఆవిష్కరించారు. యువతకు మత్తు పదార్థాలపైన అవగాహన కల్పించేందుకు అయ్యప్ప రాష్ట్ర సమితి ఈ కార్యక్రమం చేపట్టింది. కార్యక్రమంలో సీఐలు శ్రీధర్, చాంద్ బాషా, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీరాములు, శ్రీనివాసులు, నగర అధ్యక్షులు నాగరాజు, నగర నాయకులు చంటి దస్తగిరి పాల్గొన్నారు.

## పెంచిన ఫిట్నెస్ చార్జీలను ఉపసంహరించుకోవాలి

మనగళం, కర్నూలు సిటీ : 20 సంవత్సరాలు దాటిన హెవీ వాహనాలకు రూ.1,340 ఉన్న ఫిట్నెస్ ఫీజును రూ.33, 400 పెంచడం సమంజసం కాదని కర్నూలు జిల్లా మోటార్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ నాయకులు ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పెరిగిన డీజిల్ ధరలు స్పేర్ పార్ట్స్ టైర్లు టోల్గేట్ సెస్ వాటితో పాటు రవాణా రంగం కుదేలవుతున్న తరుణంలో ఫిట్నెస్ చార్జీలు అమాంతంగా పెంచడం లారీ యజమానులకే కాక సామాన్య ప్రజల నీత్యవసర సరుకులు ధరలు పెరుగుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని చూడడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి రవాణా వాహ న యజమానులను ఆదుకోవాలని కోరారు. 9వ తేదీ అర్ధరాత్రి నుండి రవాణా వాహన యజమానులు చేపట్టే సమ్మెకు కర్నూలు జిల్లా మోటార్ వర్కర్స్ సంపూర్ణ మద్దతు ఉంటుందని నాయకులు ప్రకటించారు.

## కర్నూలు మండలంలో రోడ్ల నిర్మాణాలు చేపట్టండి

మనగళం, కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు మండలం ఎదురూరు, తొలిసాపురం, ఆర్కే దుద్యాల, బసవపురం గ్రామాలకు రోడ్ల నిర్మాణం చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రామకృష్ణ, మండల కార్యదర్శి హుస్సేనయ్య, నాయకులు రాఘవేంద్ర, ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ డాక్టర్ సిరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్లు పూర్తిగా దెబ్బ తినడంతో ప్రమాదా జరుగుతున్నాయన్నారు. సచివాలయం అధికారులు సమయానికి కార్యాలయానికి వచ్చే పరిస్థితి లేదన్నారు. విద్యార్థులు కళాశాలలకు స్కూళ్లకు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారన్నారు. గర్భిణులు హాస్పటల్ కు వెళ్లడానికి నరకయాతన అనుభవిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు, గ్రామీణులు భయంతో ప్రయాణాలు చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. సంవత్సరాలు గడుస్తున్న సమస్య పరిష్కారం కావడం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు.

# పీజీఆర్ఎస్ అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలి

**– ప్రతికూల వార్తలపై అధికారులు తక్షణం స్పందించాలి – జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి**





మనగళం, కర్నూలు కలెక్టరేట్ : పీజీఆర్ఎస్ అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రస్సల్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుండి సమస్యల వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా సమస్యల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..పిజిఆర్ఎస్ ద్వారా అర్జీలను మరింత సమర్థవంతంగా పరిష్కరించేందుకు నోడల్ అధికారులను నియమించడం జరుగుతోందన్నారు. ప్రీ–ఆడిటింగ్ బృందాల ద్వారా అర్జీల పరిష్కారం లో నాణ్యతను పెంచాలని ఆదేశించారు. లాగిన్ లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూసి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంప్రాపర్ రెడ్రసెల్ ఉండకూడదని, ప్రజలు సంతృప్తి చెందే విధంగా అర్జీలను పరిష్కరించాలన్నారు. ప్రతి అర్జీదారుతో సంబంధిత అధికారి నేరుగా మాట్లాడి, స్పష్టమైన ఎండార్స్మెంట్ ఇవ్వడం తప్పనిసరి అని తెలిపారు. రెవెన్యూ, సర్వే, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలకు సంబంధించిన అర్జీలు అత్యధికంగా వస్తున్నందున, ఈ శాఖలు వేగవంతంగా స్పందించాలని సూచించారు. మండల స్థాయి అధికారులు అర్జీలకు సంబంధించి ఎండార్స్మెంట్ సక్రమంగా ఇవ్వడం లేదని, స్పష్టంగా, త్వరితగతిన ఎండార్స్మెంట్ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. వార్తాపత్రికల్లో వచ్చిన ప్రతికూల వార్తలపై సంబంధిత శాఖల అధికారులు వేగంగా స్పందించి నివేదికను పంపించాలని ఆదేశించారు. వీధి కుక్కలు, పందుల సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని అన్న క్యాంటీన్లను ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం పరిశీలించి, నాణ్యత, పరిశుభ్రతను తనిఖీ చేసి, తనిఖీల ఫొటోలను అధికారుల గ్రూప్ లో అప్లోడ్ చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల్లో సుమారు 450 మంది పాఠశాలకు గైర్ హాజరు అయినట్లు గుర్తించామని, వారిని తిరిగి పాఠశాలలో చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీఇఓ, ఆర్డీవో లను ఆదేశించారు. ఆ విద్యార్థుల కుటుంబాలు వలసలకు వెళ్లినట్లయితే,తలిదండ్రులతో మాట్లాడి, వారిని తిరిగి రప్పించి, సీజనల్ హాస్టళ్లలో విద్యార్థులను చేర్పించాలని ఆదేశించారు. అదేవిధంగా, పదవ తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన వంద రోజుల ప్రత్యేక విద్యా ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు. డ్రాపౌట్ అయినా ప్రతి విద్యార్థి కూడా పాఠశాలకు తిరిగి చేరే వరకు అధికారులు ఫాలోఅప్ చేయాలన్నారు. పదవ తరగతి విద్యార్థులకు కీలకమైన దశ అని, విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రతి విద్యార్థి పదవ తరగతి పాస్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్ఓ వెంకట నారాయణమ్మ, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లు అనురాధ, కొండయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

**– కర్నూలు జిల్లా అదనపు ఎస్పీ హుస్సేన్ పీరా**



మనగళం, కర్నూలు క్రైం : విద్యార్థులు, యువకులు చెడు వ్యసనాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కర్నూలు జిల్లా అదనపు ఎస్పీ హుస్సేన్ పీరా పిలుపునిచ్చారు. హలో యువత మేలుకో – మత్తు పదార్థాల నుండి నిన్ను నువ్వు కాపాడుకో అనే నిదానంతో ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ముద్రించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించిన ఏఎస్పీ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. పోలీసులు పట్టుకునే మత్తు పదార్థాల రవాణా కేసులో అధిక శాతం యువకులే ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్, గంజాయి, గుట్కా, మద్యం లాంటివి సేవించడం వల్ల ఆరోగ్యం చెడిపోవడమే కాకుండా విద్య, ఉద్యోగం, భవిష్యత్తు దెబ్బతింటాయన్నారు. చిన్నచిన్న ఆనందాలు, సమాజశాంతి శాశ్వతంగా దెబ్బతింటుందన్నారు. విద్యార్థులు, యువకుల ప్రవర్తనపై తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు, శ్రీనివాసులు మాట్లాడుతూ మత్తు పదార్థాల వ్యసనం ఒక వ్యక్తి సమస్య కాదని, అది కుటుంబం, సమాజం పైన, ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రతి ఫిర్యాదుకు సత్వరమే పరిష్కారం



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే ప్రతి ఫిర్యాదుకు సత్వరమే పరిష్కారం చూపాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. సోమవారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో పీజిఆర్యస్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ విభాగాలకు సంబంధించి 28 అర్జీలు రాగా, వాటిని చట్టపరిధిలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ అర్జీదారులకు హామీనిచ్చారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, కార్యదర్శి నాగరాజు, ఎంఈ మనోహర్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగశివ ప్రసాద్, ఆర్ఓ జునైద్, టిడ్కో అధికారి పెంచలయ్య, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## వాట్సాప్‌లో ఆర్బీఐ స్పష్టీకరణ




ముంబై , డిసెంబరు 8, మనగళం,. దేశంలో నాణేలపై పుకార్లు పెరగడంతో ప్రజలు, వ్యాపారులు అనవసరంగా అయోమయానికి గురవుతున్నారు. ముఖ్యంగా రూ.10 నాణేలు చెల్లవన్న అపోహ చాలాకాలంగా తిరుగుతోంది. ఆర్బీఐ పలుమార్లు వివరణ ఇచ్చినా, ఇంకా చాలా చోట్ల దుకాణదారులు రూ.10 నాణేలు తీసుకోవడానికి తిరస్కరిస్తున్నారు. ఈ నేపథ్యంలో నేడు రిజర్వ్ బ్యాంక్ నేరుగా చర్యలకు దిగింది. ఆర్బీఐ వాట్సాప్ ద్వారా ప్రజలకు పర్సనల్ మెసేజ్‌లు పంపుతూ నాణేల చెల్లుబాటు గురించి స్పష్టంగా తెలియజేసింది. నాణేలపై వస్తున్న పుకార్లను ఖండిస్తూ, అవగాహన కలిగించే వీడియోను కూడా షేర్ చేసింది.ఆర్బీఐ పంపిన వివరాల ప్రకారం 50 పైసల నాణే నుంచి రూ.1, రూ.2, రూ.5, రూ.10, రూ.20 నాణేలు అన్నీ చట్టబద్ధమైనవే. వీటి డిజైన్ ఒక్కోసారి మారవచ్చు కానీ, డిజైన్ మార్పుతో చెల్లుబాటు మారదని స్పష్టం చేసింది. నాణేల గురించి అసత్య ప్రచారాలు, సోషల్ మీడియా పుకార్లు ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని ఆర్బీఐ హెచ్చరించింది. వ్యాపారులు, దుకాణదారులు కూడా ఎలాంటి సందేహం లేకుండా నాణేలను స్వీకరించాలని రిజర్వ్ బ్యాంక్ కోరింది. దేశవ్యాప్తంగా నాణేల చెల్లుబాటుపై నెలకొన్న అపోహలను తొలగించేందుకు ఈ నేరుగా పంపిన వాట్సాప్ సందేశాలు ప్రభావం చూపుతాయని ఆర్బీఐ అధికారులు భావిస్తున్నారు.

## 13న 'రాజ్యాంగం సవాళ్లు - పౌరుల బాధ్యతపై సెమినార్

**– హాజరుకానున్న మద్రాస్ హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రు**




మనగళం, కర్నూలు సిటీ : స్థానిక టీజీవి కళాక్షేత్రంలో ఈ నెల 13న ఉదయం 11 గంటలకు 'రాజ్యాంగం సవాళ్లు – పౌరుల బాధ్యత " అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నట్లు బార్ అసోసియేషన్, లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక, వివిధ లాయర్ల సంఘాలు నాయకులు తెలిపారు. ఈ సెమినార్ కు మద్రాస్ హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రు ముఖ్యఅతిథిగా హాజరవతారన్నారు. ఈ మేరకు సోమవారం కోర్టు ఆవరణలో సెమినార్ కరపత్రాలను నాయకులు విడుదల చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు హరినాథ చౌదరి, కార్యదర్శి వెంకటేశ్వర్లు, లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక గౌరవ సలహాదారు సీనియర్ న్యాయవాది జయరాజు, కన్వీనర్ నరసింహ, ఐలు కేంద్ర నాయకులు వెంకటస్వామి, జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, ప్రజాహిత వేదిక కన్వీనర్ మురళి, బాలోత్సవం కార్యదర్శి ధనంజయ, లాయర్లు రవికాంత్, సుమంత్, హైమావతి, ముంతాజ్ బేగం, సుబ్బయ్య, రాజేష్,నిత్యజీవరాజు, శ్రీనివాసులు, రవిరాజు, మాదన్న తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు అండగా ఉంటాం


- విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం
- కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్



మనగళం, కర్నూలు క్రైం : న్యాయం కోసం వచ్చిన ప్రతి బాధితుడికి అండగా ఉంటామని, విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తామని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పేర్కొన్నారు. కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు జిల్లా ఎస్పీ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 119 ఫిర్యాదులు వచ్చాయని పోలీసులు తెలిపారు.

ఉద్యోగం ఇప్పిస్తామని రూ. లక్ష తీసుకుని మోసం చేశారు : సర్వ శిక్ష అభియాన్ లో ప్రభుత్వ పథకం కింద ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం ఇస్తామని చెప్పి రూ. 1 లక్ష తీసుకొని గూడూరు కు చెందిన సుధాకర్ మోసం చేశాడని కర్నూలు శ్రీరామం నగర్ కు చెందిన అన్నమ్మ ఫిర్యాదు చేశారు. సుధాకర్ ఫేక్ ఆర్డర్ కాపీ ఇచ్చి రెండు నెలలు పని చేయించుకుని మోసం చేశాడని ఆరోపించారు. తనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. నాకు అన్నం పెట్టకుండా ఇంటి నుంచి గెంటేశారు. వారికి కౌన్సిలింగ్ ఇచ్చి నాకు అన్నం పెట్టే విధంగా చూడాలని గూడూరు కు చెందిన అంజనమ్మ ఫిర్యాదు చేశారు. కర్నూలు ఆర్మీ ఎన్సీసీ క్యాంటీన్ లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని కర్నూల్ కు చెందిన కాశీం వలి రూ. 5 లక్షలు తీసుకొని మోసం చేశాడని కర్నూలు, బాలాజీ నగర్ కు చెందిన భారతి ఫిర్యాదు చేశారు. కర్నూల్ , వెంకాయ పల్లె దగ్గర ఉన్న తన 1 ఎకర 40 సెంట్ల మా భూమిని కబ్జా చేసిన వారి పై చర్యలు తీసుకోవాలని కర్నూల్, మిలటరీ కాలనీ కి చంద్రమ్మ ఫిర్యాదు చేశారు. కర్నూలుకు చెందిన బొజుగు కిషోర్ రూ. 11 లక్షల 10 వేలు తీసుకొని హైదరాబాదులో సాఫ్ట్వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని, ఫేక్ లెటర్ ఇప్పించి మోసం చేశాడని హైదరాబాద్ కు చెందిన దీప ఫిర్యాదు చేశారు. పవన్ రెసిడెన్సి ఓనర్స్ వాట్సప్ గ్రూప్ లో నన్ను అవమానిస్తూ కించపరిచే విధంగా మాట్లాడిన వ్యాఖ్యలకు సంబంధించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కర్నూల్ కు చెందిన జ్ఞానేశ్వర గుప్తా ఫిర్యాదు చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సందర్భంగా కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా, సీఐలు శ్రీనివాస నాయక్, ఇబ్రహీం, శ్రీధర్ పాల్గొన్నారు.

## డీవీఎల్ రాష్ట్రస్థాయి సదస్సులో కేఎంసి విద్యార్థి ప్రతిభ



మనగళం, కర్నూలు సిటీ : డీవీఎల్ రాష్ట్రస్థాయి సదస్సులో కేఎంసి విద్యార్థి ప్రతిభ చాటారు. ఆంధ్రప్రదేశ్ ఐ.ఏ.డీ.వీ.ఎల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 44వ యాన్యువల్ స్టేట్ కాన్ఫరెన్స్ 6,7 తేదీలలో తిరుపతిలోని ఎస్వీ మెడికల్ కాలేజ్ డీవీఎల్ డిపార్ట్మెంట్ నిర్వహణ బాధ్యతలతో స్టేట్ కాన్ఫరెన్స్ కాలేజీలోని భువన విజయం ఆడిటోరియం లో నిర్వహించడం జరిగింది. ఈ రాష్ట్రస్థాయి సదస్సులో వివిధ మెడికల్ కళాశాల నుంచి డీవీఎల్ డిపార్ట్మెంట్ సీనియర్ ప్రొఫెసర్లు, అసోసియేట్ అసిస్టెంట్, పీజీ విద్యార్థులు పాల్గొనడం జరిగింది. కర్నూల్ మెడికల్ కాలేజీ కి చెందిన పీజీ సెకండ్ ఇయర్ విద్యార్థి డా.యస్ మనురాజ్ "బెస్ట్ అవార్డు పేపర్ ఇన్ కేస్ రిపోర్టింగ్" లో ఉత్తమ పేపర్ ప్రజంటేషన్ కు అవార్డు లభించింది. ఈ సందర్భంగా కర్నూల్ మెడికల్ కాలేజీ డీవీఎల్ డిపార్ట్మెంట్ విభాగాధిపతి డా. లెక్కల శ్రీదేవి, డిసిగ్నేటెడ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.గౌతమిశ్రీ డాక్టర్ కె. చిట్టి నరసమ్మ కలిశారు. అవార్డు పొందిన విద్యార్థితోపాటు డీవీఎల్ డిపార్ట్మెంట్ సిబ్బందిని ప్రిన్సిపాల్ అభినందనలు తెలిపారు. ఆర్గనైజింగ్ చైర్ పర్సన్, ఎస్.వి.మెడికల్ కాలేజ్ డీవీఎల్ విభాగాధిపతి డా. పి.శ్రీనివాసులు వివిధ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తూ రెండు రోజులు డివిఎల్ కు సంబంధించి లేటెస్ట్ డెవలప్మెంట్ లపై విస్తృత చర్చ జరిగిందని తెలిపారు.

# ప్రగతికి సహకారం అభినందనీయం

- నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్
- రూ.10.64 లక్షలు ఆస్తి పన్నులు వసూలు



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగర ప్రగతికి ప్రధాన ఆదాయ వనరు అయిన ఆస్తి పన్నులను చెల్లిస్తున్న వాణిజ్య సముదాయాల యజమానుల సహకారం అభినందనీయమని కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. సోమవారం మూడు వాణిజ్య దుకాణాల నుండి వచ్చిన రూ.10,64,111 చెక్కులను రెవెన్యూ విభాగ సిబ్బంది కమిషనర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సహకారంతోనే అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయని, ప్రతి పౌరుడు సమయానికి పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి తోడ్పడాలని కమిషనర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఆర్‌ఓ జునైద్, ఆర్‌ఐలు రాజు, భార్గవ్, సుహైద్, తదితరులు పాల్గొన్నారు.

# నగరాభివృద్ధికి పెద్దపీట

- మేయర్ బి.వై. రామయ్య

మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగరాభివృద్ధికి పెద్దపీట వేసినట్లు నగరపాలక సంస్థ స్థాయి సంఘం చైర్మన్, మేయర్ బి.వై. రామయ్య అన్నారు. సోమవారం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో స్థాయి సంఘ సమావేశం నిర్వహించారు. 22 అంశాలకు ప్రవేశపెట్టగా 4 తీర్మానాలకు ఆమోదం తెలిపి, 18 అంశాలను వాయిదా వేశారు. సుప్రీంకోర్టు ఏ, బి, సి నిబంధనల ప్రకారం వీధి కుక్కలకు ఆశ్రమ కేంద్రం (స్టెరిలైజేషన్ సెంటర్) కల్లూరు మండలం, బస్తిపాడు గ్రామం సర్వే నం.362లో సరిహద్దు గోడతో కూడిన శాశ్వత ఆశ్రయం నిర్మించేందుకు రూ.25 లక్షలు కేటాయించారు. కల్లూర్ మండలం బస్తిపాడు గ్రామము నందు వీధి పశువులు, జంతువుల కోసం జిఐ షెడ్, సరిహద్దు రక్షణ గోడ, సరిహద్దు రక్షణ అవసరమైన సౌకర్యాలతో కూడిన ప్రత్యేక ఆశ్రయం ఏర్పాటుకు రూ.25.00 లక్షలను కేటాయించారు. బ్యానర్లు, ఫ్లెక్సీలు తొలగింపు డెమోలిష్ స్క్వాడ్‌ను కాంట్రాక్ట్ ప్రాతిపదికన 12 మందికి 01-04-2025 నుండి 31-03-2026 వరకు ఏడాది వేతనాలను రూ.30 లక్షలు కేటాయించారు. సమావేశంలో కమిషనర్ పి.విశ్వనాథ్, సభ్యులు షేక్ అహ్మద్, సాంబశివరావు, మునెమ్మ, నారాయణ రెడ్డి, వై.వెంకటేశ్వర్లు, అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, కార్యదర్శి నాగరాజు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగశివ ప్రసాద్, ఎంఈ మనోహర్ రెడ్డి, ఆర్‌ఓ జునైద్, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలి




మనగళం, కర్నూలు కలెక్టరేట్ : సావిత్రిబాయి పూలే జయంతి దినోత్సవాన్ని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి కోరారు. కర్నూలు జిల్లా కలెక్టరు కార్యాలయం ముందు ఎఎస్టీ బీసీ, మైనార్టీ మహిళా ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ధర్నా కార్యక్రమంలో నేషనల్ ఓబీసీ మోర్చ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు డాక్టర్ కంచర్ల హరిప్రసాద్, సీపీఐ నాయకులు జగన్నాథం, బహుజన నాయకులు శేషఫణి,కైలాష్ నాయక్, విద్యార్థి నాయకులు భరత్ కుమార్ ఆచారి,సీమకృష్ణ, పగడాల ఆనంద్ బాబు, వి.వి.నాయుడు, విజయ్ భాస్కర్, ఎమ్మార్పీఎస్ నాయకులు కుమార్ మాదిగ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పట్నం రాజేశ్వరి మాట్లాడుతూ భారతదేశ మొట్ట మొదటి మహిళా ఉపాధ్యాయులు చదువుల తల్లులు, ఆధునిక సామాజిక సంఘ సంస్కర్తలు సావిత్రిబాయి పూలే - ఫాతిమాషేక్ ల జయంతి కార్యక్రమాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలన్నారు.1848 సంవత్సరంలోనే మొట్ట మొదటి దళిత బాలికల పాఠశాలను ఏర్పాటు చేసి భారతదేశంలో ఉన్న మహిళలందరికీ చదువుని అందించడమే కాకుండా సామాజిక సంఘసంస్కర్త గా కూడా వారు ఎన్నో సేవలు చేశారని గుర్తు చేశారు. సావిత్రిబాయి పూలేతో పాటు ఫాతిమా షేక్ ఆనాటి మత ఛాందస వాదుల దాడులను ఎదుర్కొని, బాలికలకు విద్యను అందించడం సాహసోపేతమైన నిర్ణయం అని కొనియాడారు. సావిత్రిబాయి పూలే అలాగే ఫాతిమా షేక్ మహిళల విద్యాభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేశారు. 2025 జనవరి 3 వ తేదీన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సావిత్రిబాయి పూలే జన్మదినాన్ని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించారని, మన రాష్ట్రంలో నేటికీ ప్రకటించకపోవడం కూటమి ప్రభుత్వం బి.సి ల పట్ల చూపుతున్న నిర్లక్ష్యం కాదా అని ఆమె ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు మహిళల విద్య కోసం తన జీవిత కాలం కృషి చేసిన చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జన్మదినాన్ని మహిళా ఉపాధ్యాయ దినోత్సవం గా ప్రకటించాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మహిళా ఐక్య వేదిక కర్నూలు జిల్లా అధ్యక్షురాలు వగ్గ ఈరమ్మ, నంద్యాల జిల్లా అధ్యక్షురాలు కటికే భాను, ఆదోని డివిజన్ అధ్యక్షురాలు గుడిపి ఎలీశమ్మ, హసీనా, పాలెం రాధ, ఆకుతోట పద్మావతి, హుస్సేన్ బీ, తాటికొండ సుంకమ్మ, కొమ్ము పెద్దక్క షేకున్ బీ, మరియమ్మ, ఈడిగ రంగమ్మ, కళావతి, కన్యాకుమారి, చిరంజీవమ్మ అమీనాబీ, రేవతి, ఖాసీం బీ, దస్తగిరమ్మ, ఖాజాబీ, సులోచన, వెంకటలక్ష్మీ , జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## 13 న జిల్లా స్థాయి షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు

మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు అవుట్డోర్ స్టేడియం నందు ఈనెల 13 వ తేదీన శనివారం జిల్లా స్థాయి షూటింగ్ బాల్ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘం కార్యదర్శి ఈశ్వర్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపిక పోటీలు సీనియర్ పురుషుల స్త్రీల విభాగంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను డిసెంబర్ 18 నుంచి 21 వరకు కర్నూలు జిల్లా లో జరగబోయే 44వ రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. వివరాలకు ఫోన్ నెంబర్ 9989982655, 7013886343 కు సంప్రదించాలని సూచించారు.

---

# ఇంప్రాపర్ రెడ్రెస్సల్ శాతం ఇంకా తగ్గించాలి




- పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల లోపలికి వీధి కుక్కలు రాకుండా చర్యలు చేపట్టండి
- కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

మనగళం, కర్నూలు సిటీ : జిల్లాలో పీజీఆర్ఎస్ పనితీరు విశ్లేషణ లో భాగంగా ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చిన నివేదిక ప్రకారం నవంబర్ నెలలో ఇంప్రాపర్ రెడ్రెస్సల్ శాతం బాగా తగ్గిందని, డిసెంబర్ నెలలో ఇంకా ఎక్కువగా తగ్గించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి పిజిఆర్ఎస్, స్వామిత్వ, వీధి కుక్కల సమస్యల పరిష్కారం తదితర అంశాలపై జిల్లా అధికారులు, మండల స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్డీఓ ఆదోని, తహసీల్దార్ లు వెల్దుర్తి, ఎమ్మిగనూరు నవంబర్ నెలలో ఇంప్రాపర్ రెడ్రెస్సల్ శాతం చాలా బాగా తగ్గించారని, ఇలాగే జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, తహసీల్దార్లు, అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఫిర్యాదులను ఆడిట్ చేయడంలో 20 శాతం పెండింగ్ ఉందని, వెంటనే ఆడిట్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. వీధి కుక్కల సమస్యల పరిష్కారంలో భాగంగా సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల లోపలికి వీధి కుక్కలు రాకుండా చర్యలు తీసుకోవాలని, ఒకవేళ కాంపౌండ్ వాల్ లేని పక్షంలో వెంటనే నాచురల్ ఫెన్సింగ్ లాంటివి ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అదే విధంగా వసతి గృహాల నుండి వచ్చే చెత్తను అక్కడే పరిసరాల్లో పడవేయకుండా, మున్సిపాల్టీ వారికి ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. యాంటి రాబీస్ వాక్సినేషన్ లను అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ వైద్యాధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీలలో ఉన్న వీధి కుక్కలను సంబంధిత గ్రామాల్లో ఉన్న పశుసంవర్ధక శాఖ వైద్యులతో స్టెరిలైజేషన్ చేయించాలని కలెక్టర్ పశు సంవర్ధక శాఖ అధికారిని ఆదేశించారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం ఈ ప్రక్రియ 15 రోజుల్లోపు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కి సంబంధించి ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో పురోగతి తీసుకొని రావాలని కలెక్టర్ ఏఈఆర్ఓ లను ఆదేశించారు. కర్నూలు, పాణ్యం , ఆదోని నియోజకవర్గాలు వెనుకబడి ఉన్నాయని, సంబంధిత నియోజకవర్గాల బి ఎల్ ఓ లకు మరొక్కసారి ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిఆర్ఓ ను ఆదేశించారు.

# సంపాదకీయం

## అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం..

అవినీతి అనేది కేవలం ఒక దేశానికి లేదా ప్రాంతానికి మాత్రమే పరిమితమైన సమస్య కాదు. ఇది ప్రపంచవ్యాప్తంగా ప్రతి సమాజాన్ని, ప్రతి పాలనా వ్యవస్థను, ప్రతి ఆర్థిక వ్యవస్థను ముంచెత్తుతున్న అగోచర వ్యాధి. అధికారాన్ని వ్యక్తిగత లాభాల కోసం వాడడం, చట్టాలను అధిగమించి ధనం కూడబెట్టుకోవడం, ప్రజా సంక్షేమానికి కేటాయించిన నిధులను దారి మళ్లించడం, ప్రజల నమ్మకాన్ని దగా చేయడం వంటి పనులు జరిగే చోట అవినీతి వేర్లు పాతుకుంటుంది. ఇవన్నీ ఒక దేశం అభివృద్ధి చెందడానికి ఉన్న అవకాశాలను నేలకూల్చే శక్తిని కలిగి ఉంటాయి. డిసెంబర్ 9న జరుపుకునే అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం, ఒక్కరోజు ఆధారంగా సమస్యను పరిష్కరిస్తుందని కాదు, కానీ ప్రపంచం ఇంకా ఈ ప్రమాదంతో తీవ్రంగా పోరాడుతున్నదని గుర్తు చేసే సందర్భం.

అవినీతి ఎదగడానికి కారణం కేవలం దురాశ మాత్రమే కాదు. దానికి సహకరిస్తున్న అసలు వ్యవస్థే. పారదర్శకత కోల్పోయిన పాలన, నెమ్మదిగా నడిచే న్యాయవ్యవస్థ, సాక్షాలను తిరగబెట్టగల రాజకీయ శక్తి, చట్టాలను తమకనుకూలంగా మార్చుకునే ప్రభావవంతుల సామర్థ్యం వంటి అంశాలు అవినీతికి రక్షణ కవచం అవుతాయి. అవినీతిపరులు శిక్షించబడట్లేదు అనే భావన బలపడినప్పుడు, దానిని అనుకరించే వాళ్లు కూడా పెరుగుతారు. చివరికి అవినీతి ఒక వ్యక్తి చేసే తప్పు కాకుండా, వ్యవస్థలో భాగంగా మారిపోతుంది. ఒక పని చేయించుకోవాలంటే లంచం అవసరం అనే మాట సామాన్యుడికి సహజంగా అనిపించే స్థాయికి చేరినప్పుడు, నిజమైన ప్రజాస్వామ్యం వాడిపోయినట్టే.

అవినీతి ఆర్థిక వ్యవస్థపై చూపే ప్రభావం మరింత ప్రమాదకరం. ఒక దేశం అందుకున్న పన్ను రూపంలో వచ్చే ధనం, అభివృద్ధి కోసం కేటాయించిన బడ్జెట్, సామాజిక సంక్షేమానికి ఇచ్చే నిధులు అన్నీ జనహితానికి వ్యతిరేకంగా మలుపుతిప్పబడుతుంటాయి. పెద్ద ప్రాజెక్టులు ఆలస్యమవుతాయి, ప్రభుత్వ కార్యక్రమాలు నాణ్యత కోల్పోతాయి, బ్యాంకింగ్ మరియు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాలలో భారీ ఆర్థిక నష్టాలు వస్తాయి. విదేశీ పెట్టుబడులు కూడా ఈ వాతావరణాన్ని చూసి వెనుకడుగు వేస్తాయి. ఇలా చూస్తే, అవినీతి కేవలం వ్యక్తిగత లాభాలకు దారి తీసే అక్రమ చర్య కాదుబీ అది ఒక దేశం అభివృద్ధిని దశాబ్దాల పాటు వెనక్కి నెట్టే శక్తి. అదే సమయంలో ధనవంతుల ప్రభావం ఇంకా పెరుగుతుంది, పేదల హక్కులు మరింత క్షీణిస్తాయి. సమాజంలో అసమానత విస్తరిస్తుంది.

అయితే పౌరులు ఈ సమస్యను ఎందుకు అంగీకరిస్తున్నారు? అవినీతిని ఎదిరించడానికి కావాల్సిన సామాజిక భద్రత మరియు న్యాయ పరిరక్షణ మన దేశంలో బలంగా లేవు. అవినీతి బయటపెట్టే వ్యక్తులు బెదిరింపులకు గురవుతారు, ఉద్యోగాలు కోల్పోతారు, కేసులు ఎదుర్కొంటారు, కొన్నిసార్లు ప్రాణ నష్టం కూడా ఎదురవుతుంది. అటువంటి వాతావరణంలో సాధారణ వ్యక్తి న్యాయం కోసం పోరాడటానికి ప్రయత్నించడమే ప్రమాదకరం. అందుకే, అవినీతితో బాధపడుతున్న సమాజం, దానిని ఎదిరించే శక్తిని కోల్పోయి మౌనంగా జీవించడానికి అలవాటు పడుతుంది. ఈ మౌనం అవినీతికి అతిపెద్ద అస్త్రం.

ప్రతి సంవత్సరం అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం సందర్భంగా ప్రభుత్వాలు గొప్ప వాగ్దానాలు చేస్తాయి. ప్రసంగాలు, ప్రచార కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు జరుగుతాయి. కానీ అసలు ప్రశ్న ఏమిటంటే: ఈ సమస్యకు సమాధానం మాటలతోనా, లేక నిజమైన చర్యలతోనా? శిక్షలను కఠినతరం చేయడం, న్యాయవ్యవస్థను వేగవంతం చేయడం, పారదర్శక పాలనను అమలు చేయడం, ప్రభుత్వ డేటాను పౌరులకు అందుబాటులో ఉంచటం వంటి చర్యలు ఉంటేనే మార్పు కనిపిస్తుంది. ప్రజల ప్రయోజనాలను కాపాడే విధానాలు, అధికార దుర్వినియోగాన్ని అడ్డుకునే చట్టాలు బలపడితేనే అవినీతి తగ్గుతుంది. కానీ ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో ఇవి ఇంకా ఆచరణలో బలహీనంగా ఉన్నాయి.

అవినీతిని పూర్తిగా నిర్మూలించడం ఒక్కరోజు పని కాదు. ఇది చట్ట వ్యవస్థ, రాజకీయ వ్యవస్థ, మీడియా, పౌర సమాజం, ముఖ్యంగా యువత కలిసి పోరాడాల్సిన సమస్య. యువత అవినీతి రహిత భవిష్యత్‌ను కోరుకుంటేనే, ఆ భవిష్యత్ నిర్మాణం సాధ్యం. వారు ప్రశ్నించే ధైర్యం, నిజం కోసం నిలబడే ధృఢత, బాధ్యత ఉన్న నాయకత్వం మీద ఒత్తిడి తెచ్చే ధోరణి అవసరం. సమాజం మౌనంగా ఉన్నంత వరకు అవినీతి గెలుస్తుంది. సమాజం ప్రశ్నించినప్పుడు మాత్రమే ప్రజాస్వామ్యం జీవిస్తుంది.

అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం మనకు ఒక స్పష్టమైన నిజం గుర్తు చేస్తుంది. అవినీతి ఒక వ్యక్తి చేసే తప్పు మాత్రమే కాదుబీ అది సమాజం మొత్తం మీద భారం. దానిని తట్టుకోవడం మన బాధ్యత కాదుబీ దానిని ఎదిరించడం మన హక్కు. మనం అది చేయగలిగితేనే ప్రజాస్వామ్యం బలపడుతుంది. మనం నిర్లక్ష్యం చేస్తే, అది మనను నశింపజేస్తుంది. ప్రతి సంవత్సరం అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం సందర్భంగా ప్రభుత్వాలు గొప్ప వాగ్దానాలు చేస్తాయి. ప్రసంగాలు, ప్రచార కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు జరుగుతాయి. కానీ అసలు ప్రశ్న ఏమిటంటే: ఈ సమస్యకు సమాధానం మాటలతోనా, లేక నిజమైన చర్యలతోనా? శిక్షలను కఠినతరం చేయడం, న్యాయవ్యవస్థను వేగవంతం చేయడం, పారదర్శక పాలనను అమలు చేయడం, ప్రభుత్వ డేటాను పౌరులకు అందుబాటులో ఉంచటం వంటి చర్యలు ఉంటేనే మార్పు కనిపిస్తుంది. ప్రజల ప్రయోజనాలను కాపాడే విధానాలు, అధికార దుర్వినియోగాన్ని అడ్డుకునే చట్టాలు బలపడితేనే అవినీతి తగ్గుతుంది. కానీ ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో ఇవి ఇంకా ఆచరణలో బలహీనంగా ఉన్నాయి.

అవినీతిని పూర్తిగా నిర్మూలించడం ఒక్కరోజు పని కాదు. ఇది చట్ట వ్యవస్థ, రాజకీయ వ్యవస్థ, మీడియా, పౌర సమాజం, ముఖ్యంగా యువత కలిసి పోరాడాల్సిన సమస్య. యువత అవినీతి రహిత భవిష్యత్‌ను కోరుకుంటేనే, ఆ భవిష్యత్ నిర్మాణం సాధ్యం. వారు ప్రశ్నించే ధైర్యం, నిజం కోసం నిలబడే ధృఢత, బాధ్యత ఉన్న నాయకత్వం మీద ఒత్తిడి తెచ్చే ధోరణి అవసరం. సమాజం మౌనంగా ఉన్నంత వరకు అవినీతి గెలుస్తుంది. సమాజం ప్రశ్నించినప్పుడు మాత్రమే ప్రజాస్వామ్యం జీవిస్తుంది.

అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం మనకు ఒక స్పష్టమైన నిజం గుర్తు చేస్తుంది. అవినీతి ఒక వ్యక్తి చేసే తప్పు మాత్రమే కాదుబీ అది సమాజం మొత్తం మీద భారం. దానిని తట్టుకోవడం మన బాధ్యత కాదుబీ దానిని ఎదిరించడం మన హక్కు. మనం అది చేయగలిగితేనే ప్రజాస్వామ్యం బలపడుతుంది. మనం నిర్లక్ష్యం చేస్తే, అది మనను నశింపజేస్తుంది.

# డోన్ లో జరిగే హిందూ సమ్మేళనమును జయప్రదం చేయండి



మన గళండోన్ : ఆత్మీయ హిందూ సోదర సోదరీమణులకు నమస్సులు ఈరోజు ప్రాంత కార్యకారిణి కి యుగంధర్ జి ఈ నెల 14తేది జరగబోయే హిందూసమ్మేళనం పరిశీలన నిమిత్తం విచ్చేసి స్థానిక వెంకటచేలమ్ ఫంక్షన్ హాలు నందు ఘట నాయకుల సమావేశం ఏర్పాటు చేసి ఈ నెల 14తేది ఉదయం 10:00 నుంచి మధ్యాహ్నం వరకు జరుగు హిందూ సమ్మేళనం సమావేశం గురించి సభ ఏర్పాట్లు, భోజనాలు వ్యవస్థ గురించి, పట్టణం నందు ర్యాలీ గురించి వివరించి ఘట నాయకుల కు సూచనలు చేశారు. కావున మనమందరం గ్రామాలనుండి పట్టణం నుండి అధిక సంఖ్యలో మహిళలు పిల్లలు పెద్దలు ఈ సమావేశానికి విచ్చేసి ఈ కార్యక్రమం లో వక్తలు చెప్పే విషయాలు అని శ్రద్ధ గా విని సమాజం లో మనం బాధ్యత గా వ్యవహరిస్తూ జీవించాలి అని మనవి అలాగే ఈ కార్యక్రమం ను పెద్ద సంఖ్యలో పాల్గొని విజవంతం చేయాలి.

# గుమ్మనూరు నారాయణ ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రామకృష్ణ జన్మదిన వేడుకలు.





( ఆలూరు మనగళం ):కర్నూలు జిల్లా, ఆలూరు మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో గుమ్మనూరు నారాయణ, సతీమణి బీజేపీ నాయకులు గుమ్మనూరు కమలమ్మ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా బీజేపీ అధ్యక్షులు అక్కమ్మతోట రామకృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం కేకు కట్టింగ్ చేసి, సంబరాలు చేసుకొన్నారు. ఈ సందర్భంగా వైసీపీ మరియు ఇతర పార్టీల నుండి పచ్చరపల్లి, కొత్తపేట, ముద్దనగేరి, నేరనికి తాండ, గ్రామాలకు చెందిన కార్యకర్తలు రామకృష్ణ ఆధ్వర్యంలో పార్టీలో చేరడం జరిగింది. అలాగే కర్నూలులో ఈనెల 12వ తేదిన మాజీ ప్రధాని వాజ్ పెయి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం గురించి పార్టీ నాయకులు, కార్యకర్తలు చర్చించుకున్నారు. గుమ్మనూరు కమలమ్మ మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గం నుండి భారీ మొత్తంలో కార్యకర్తలు తరలి రావాలని కోరారు. గుమ్మనూరు నారాయణ మాట్లాడుతూ మన కర్నూలు జిల్లాలో బిజెపి అంటే ఆలూరు, ఆలూరు అంటే బిజెపి అనే విదంగా తీర్చి దిద్దుతాను అని తెలిపారు. ఆలూరులో 2029 కూటమి ఎవర్ని నియమిస్తే వారిని భారీ మెజారిటీతో గెలిపిస్తాము అని తెలిపారు. అలాగే వాజపేయ్ విగ్రహ ఆవిష్కరణకు దాదాపుగా 100 వాహనాలుతో భారీ మొత్తంలో కార్యకర్తలు తరలి వచ్చి, కార్యక్రమం జయప్రదం చేస్తామని, బీజేపీ జిల్లా అధ్యక్షులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గం సభ్యులు, జిల్లా ఉపాధ్యక్షులు, మండల కమిటీ నాయకులు, కార్యకర్తలు, గుమ్మనూరు అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# బైరెడ్డి శబరి కు వాల్మీకులు రుణపడి ఉంటాం.

**- వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ప్రస్తావించిన నంద్యాల ఎంపీ శబరి కు కృతజ్ఞతలు.**





( ఆలూరు మనగళం ):ఆస్పరి మండలం బోయ వాల్మీకి సంఘం అధ్యక్షుడు తలహరి హరికృష్ణ మాట్లాడుతు వాల్మీకుల చిరకాల కోరిక అయినటువంటి ఎస్టీ జాబితాలో చేర్చే అంశం గురించి, వాల్మీకులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి పార్లమెంటులో నంద్యాల పార్లమెంటు సభ్యురాలు బైరెడ్డి శబరి ప్రస్తావించారు. మండల కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడుతూ. కొన్ని సంవత్సరాలుగా వాల్మీకులు రాజకీయంగా, ఆర్థికంగా, విద్యలో సమాజంలో అణిచివేతకు గురవుతున్నారని, వాల్మీకి నాయకులు, యువత వారు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్తున్న పట్టించుకోవడంలేదని, తమ సమస్యలును పార్లమెంట్ లో ప్రస్తావించిన నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరీకు ధన్యవాదాలు అని అన్నారు. ఈ కార్యక్రంలో వాల్మీకి యూత్ సుధాకర్, వెంకన్న, వెంకటేష్, శేఖర్, పెద్ద సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన ఎమ్మెల్యే గౌరు





మనగళం, కల్లూరు అర్బన్ : పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి కల్లూరు అర్బన్ 37 వ వార్డ్ వీకర్ సెక్షన్ కాలనీ లోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సిబ్బంది హాజరు పట్టీని పరిశీలించారు. వైద్యులు సమయపాలన పాటించాలని తెలిపారు. వైద్యం పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కే పార్వతమ్మ, నియోజవర్గం తెలుగు యువత అధ్యక్షుడు జవ్వాజీ గంగాధర్ గౌడ్, క్లస్టర్ ఇంచార్జీ జనార్ధన్ ఆచారి, రాష్ట బీసీ సెల్ కార్యదర్శి కాసాని మహేష్ గౌడ్, నాగేశ్వర రావు, ఖాదర్, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాష్ట్ర కుర్ని కార్పొరేషన్ చైర్మన్ ప్రమాణ స్వీకారం

మనగళం, ప్రత్యేక ప్రతినిధి : విజయవాడలోని బీసీ భవన్ లో రాష్ట్ర కుర్ని కార్పొరేషన్ చైర్మన్ కామర్తి మిన్నప్ప ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కామర్తి మిన్నప్పకు అభినందనలు వెల్లువెత్తాయి. స్నేహితులు, బంధువులు, సన్నిహితులు అభినందనలు తెలిపారు. టీడీపీ సామాన్య కార్యకర్త నుండి అంచలంచలుగా ఎదిగి ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి ఆశీస్సులతో కుర్ని కార్పొరేషన్ చైర్మన్ పదవి అలంకరించిన కామర్తి మిన్నప్ప టీడీపీ నాయకుడు వడ్డే కృష్ణ అభినందనలు తెలిపారు.



# కేడీసీసీ బ్యాంకు ఉద్యోగుల రిటర్మెంట్ వయసు 62 సం,లకు పెంచాలి.

– 2019 తర్వాత ఉద్యోగంలో చేరిన ఉద్యోగస్తులను పర్మినెంట్ చేయాలి.






( ఆలూరు మనగళం ):కర్నూలు జిల్లా, ఆలూరు పట్టణంలో విధులు బహిష్కరించి బ్యాంకు ముందు నిరసనకు దిగిన కేడీసీసీ బ్యాంక్ సహకార సంఘాల సిబ్బంది, వారికీ మద్దతూ తెలిపిన కేడీసీసీ సొసైటీ చైర్మన్ బి. ఈరన్న మరియు సీఐటీయూ నాయకులు. డిఎల్ఎస్ఎఫ్ ద్వారనే నిరవధికంగా జీతభత్యాలు చెల్లించి, రిటర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 36ను అమలుపరుస్తూ, సహకార సంఘాల ద్వారానే రైతులకు పంట రుణాలు ఇవ్వాలని, 2019 తర్వాత చేరిన ఉద్యోగస్తులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ, కేడీసీసీ బ్యాంకు ముందు నిరసనకు దిగిన బ్యాంకు సీఈఓ లు మరియు ఉద్యోగులు. మా న్యాయమైన కోరికలు తీర్చేవరకు, పోరాటం ఆపమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ సొసైటీ చైర్మన్ బి. ఈరన్న మరియు కేడీసీసీ బ్యాంకు సీఈఓ లు వెంకటరెడ్డి ఆలూరు, జె. హరికృష్ణ బెల్డోన, ఎ.వీరస్వామి చింతకుంట, జె.నీలకంఠ హోలగుంద, బి.నరసింహులు ఆస్పరి, బి. వెంకటేష్ రామదుర్గం, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వీడాలి




మనగళం, ఆదోని : ఆదోని మండలం పరిధిలో సంతేకుడ్లూర్ గ్రామంలో నెలకొన్న సమస్యలపై కేవీపీఎస్ నాయకులు ప్రజలతో సంతకాల సేకరించారు. ఈ మేరకు సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ లో సబ్ కలెక్టర్ కున నాయకులు వినతి ప్రతం అందజేశారు. ముఖ్యంగా గ్రామాల్లో రేషన్ షాపులో డబ్బాతో తూకాలు వేస్తున్నారని, ఒక్కో కుటుంబానికి మూడు కేజీల వరకు తగ్గుతున్నాయని నాయకులు ఆరోపించారు. గతంలో రెవెన్యూ అధికారులకు విన్నవించినా స్పందన లేదని వాపోయారు. అదేవిధంగా దళిత కాలనీకి ప్రభుత్వం నుండి పాఠశాలకు స్థలాన్ని కేటాయించి భవనాన్ని నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల ప్రధాన కార్యదర్శి బి.తిక్కప్ప, నాయకులు పరమేష్, కోసిగి ఈరన్న,నాగరాజు పాల్గొన్నారు.

# పాఠశాలల ప్రహారికి అక్రమంగా వేసిన దుకాణాలను తొలగించాలని జిల్లా కలెక్టర్ వినతి





మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర మరియు బాలికల ఉన్నత పాఠశాలల ప్రహరికి అక్రమంగా వేసిన ప్రవేట్ దుకాణాలను తొలగించాలని ఈరోజు కర్నూలు సునయన ఆడిటోరియం లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరిని కలసి వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రంగస్వామి మాట్లాడుతూ కోడుమూరు పట్టణంలో ఉన్న జివిఆర్ జడ్పీహెచ్ఎస్ బాలుర మరియు బాలికల ఉన్నత పాఠశాలలలో విద్యార్థిని, విద్యార్థులు దాదాపుగా 1700 మంది విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాలల ప్రహరికి ఆనుకొని అక్రమంగా ప్రైవేట్ దుకాణాలు పెట్టుకొని మత్తుపదార్థాలు సీక్రెట్ టూ పాను, గుట్కాలు వ్యాపారం చేస్తున్నారు. ఈ దుకాణాల వలన విద్యార్థులు చెడువాలవాట్లకు పడి స్కూలుకు రాకుండా బయట తిరుగుతూ ఉన్నారు. అదేవిధంగా పాఠశాలల ప్రహరికి ముందు ట్రాఫిక్ ఎక్కువగా ఉండడంతో విద్యార్థులు స్కూలుకు రావడానికి గాని మరలా తిరిగి ఇంటికి వెళ్ళడానికి గాని ఈ దుకాణాల వలన చాలా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కావున తక్షణమే పాఠశాలల ప్రహరికి ఆనుకొని అక్రమంగా వేసిన దుకాణాలను తొలగించాలని, అదేవిధంగా ఏపీ మోడల్ స్కూల్ రోడ్డు గుంతలు గుంతలుగా మారి చాలా అధ్వానమైన పరిస్థితి ఏర్పడింది. విద్యార్థిని విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు స్కూలుకి వెళ్లాలంటే మరలా తిరిగి ఇంటికి రావాలంటే సహనం చేయలేకపోతున్నారు. వర్షం వస్తే విద్యార్థులు చాలా అవస్థలు ఎదుర్కొని కొంతమంది ఇంటి దగ్గర నుంచి నడుచుకుంటూ వెళ్లే పరిస్థితి ఉంది. ప్రభుత్వ విద్యను కాపాడే విధంగా విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని తక్షణమే పాఠశాలల ప్రహరీ అక్రమంగా వేసిన దుకాణాలను మరియు ఏపీ మోడల్ స్కూల్ రోడ్డు నిర్మాణం చర్యలు చేపట్టాలని వారు కోరారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ స్పందిస్తూ తక్షణమే పనులు ప్రారంభిస్తామని హామీ ఇవ్వడం జరిగింది.ఈ వినతి పత్రం అందజేయడంలో ఏఐఎస్ఎఫ్ కోడుమూరు మండల కార్యదర్శి ఎస్.అల్తాఫ్ బాషా తదితరులు పాల్గొన్నారు...

# పరుగు పోటీలలో పతకాల వీరుడు

– గ్రామీణవాసి మొగలి వెంకటరామిరెడ్డి



నందవరం డిసెంబర్ 8 మనగలం న్యూస్ : పరుగు పోటీలలో సౌత్ ఏషియన్ అథ్లెటిక్స్ గేమ్స్ లో కాంస్య పతకం సాధించి ఇప్పుడు కే లో ఇండియా యూనివర్సిటీ గేమ్స్ లో బంగారు పతకం సాధించి మొగలి వెంకట రామిరెడ్డి దేశానికే గర్వకారణంగా నిలిచాడు.వివరాల్లోకి వెళితే కర్నూలు జిల్లా నందవరం మండలం హలహర్వి గ్రామానికి చెందిన గోపాల్ రెడ్డి,ఉమా దంపతుల కుమారుడు మొగలి వెంకటరామిరెడ్డి పరుగు పోటీలలో భాగంగా నాల్గవ సౌత్ ఏషియన్ సీనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ 2025 సంవత్సరంలో కాంస్య పతకం మరియు 40వ నేషనల్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ 2025 సంవత్సరంలో రెండు గోల్డ్ మెడల్ సాధించాడు.అలాగే (కే )లో ఇండియా యూనివర్సిటీ గేమ్స్ లో ఈనెల 4వ తేదీన 800 మీటర్ల పరుగు పోటీలో 1:51.62 సెకండ్లలో ముగించి మొదటి స్థానంలో బంగారు పతకం సాధించాడు.రాంచీ వేదికగా జరిగిన నాలుగో దక్షిణ ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ లో 800 మీటర్ల పరుగు పోటీలో 1:52.37 సెకన్లలో ముగించి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించడం విశేషం.ఈ సందర్భంగా మొగలి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ పతకాలను సాధించడంలో మా గ్రామానికి చెందిన కోచ్ మల్లికార్జున ఆధ్వర్యంలో చిన్నప్పటి నుంచి శిక్షణ పొందానని కోచ్ కు జీవితాంతం రుణపడి ఉంటానని అన్నారు. దేశం కోసం మరిన్ని పతకాలు సాధించడానికి కృషి చేస్తానని,మా గ్రామ ప్రజలు అభినందించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.అనంతరం కోచ్ మల్లికార్జున మాట్లాడుతూ నా శిక్షణ లో మొగలి వెంకట్ రామిరెడ్డి శిక్షణ పొంది పతకాలు సాధించడం నాకు ఆనందంగా ఉందని,గత మూడు సంవత్సరాల నుంచి నా ఆధ్వర్యంలో ఆర్మీ సోల్జర్స్ కు 26 మంది ఎంపికయ్యారని అన్నారు.2030 సంవత్సరంలోపు వంద మంది ఆర్మీ సోల్జర్ లను దేశానికి అందించడమే నా లక్ష్యమని తెలిపారు.అనంతరం పతకాలను సాధించిన మొగలి వెంకటరామరెడ్డిని మార్కెట్ యార్డ్ డైరెక్టర్ దావీదు, గ్రామ టిడిపి అధ్యక్షులు ఎర్రన్న,గ్రామ ప్రజలు అభినందించారు.

# అప్లై చేసిన ప్రతి పేదవాళ్లకు స్థలం కేటాయించాలి : సీపీఐ







మన గళం కుడుమూరు: గ్రామీణ ప్రాంతంలో పట్టణ ప్రాంతంలో అప్లై చేసిన ప్రతి పేదవాళ్లకు ఇంటి స్థలం కేటాయించాలని కోడుమూరు సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో గ్రామ సచివాలయం ముందు ధర్నా చేసి అనంతరం ఎమ్మార్వో కి వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమం సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి ముద్దు రాముడు ఆధ్వర్యంలో జరిగింది ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి బి రాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్ల స్థలం పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు స్థలం ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం అదేవిధంగా ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు కేటాయిస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు గత ప్రభుత్వంలో ఇచ్చిన జగనన్న ఇంటి స్థలాలను రద్దుచేసి మరల అప్లై చేసుకోవడానికి లాగిన్ ఓపెన్ చేయాలని వారు డిమాండ్ చేశారు గ్రామ పట్టణాలలో రాజకీయ జోక్యం లేకుండా అప్లై చేసిన ప్రతి వ్యక్తికి ఇండ్ల స్థలం కేటాయించాలని వారన్నారు లేనిపక్షంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు సులోచనమ్మ సిపిఐ మహిళా సంఘం నాయకులు దేవమ్మ రాజేశ్వరి లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు

# 44వ జాతీయ రహదారిపై ఆర్టీవో క్రాంతి కుమార్ సాధారణ తనిఖీ నిర్వహించారు.




నంద్యాల జిల్లా డోన్ పట్టణంలోని 44వ జాతీయ రహదారిపై ఈరోజు సోమవారం ఆర్టీవో క్రాంతి కుమార్ సాధారణ తనిఖీలలో భాగంగా ఈరోజు సోమవారం తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలలో బీహార్ రాష్ట్రానికి చెందిన ట్రావెల్ పాయింట్ ట్రావెల్స్ కు సంబందించిన బస్సు %దీ=06గ్రా+%7576 గోరకపూర్ నుండి అనంతపూర్ లో ప్రయనీకులను వదిలి తిరిగి అనంతపురం నుండి హైదరాబాద్ కు ఏడుగురు ప్రయనీకులతో వెళుతుండగా బస్సు ను డోన్ సమీపములో ఆపగా డ్రైవర్ బస్సు ను ఆపకుండా అతివేగంగా నడుపుకుంటూ పారిపోవాడానికి ప్రయత్నించడు బస్సును వెంబడించి జగదుర్తి సమీపంలో హైవే మీద కారును అడ్డం పెట్టి ఆపడం జరిగినది బస్సు యొక్క పర్మిట్ చూపించమని డ్రైవర్ను అడగ్గా బస్సు డ్రైవర్ చాలా దురుసుగా ప్రవర్తించాడు బస్సు పర్మిట్ చూపించడానికి నిరాకరించాడు బస్సు యొక్క రికార్డులు ఆన్లైన్లో పరిశీలించగా రోడ్డు టాక్స్ లేదని గుర్తించి వాహనానికి నాలుగు లక్షల తోబై ఒక్కవేల రూపాయల 4,91,000/- జరిమానా విధించడం జరిగినది.

# సెన్సెక్స్ భారీ పతనం

ముంబయి , డిసెంబరు 8 , మన గళం దేశీయ పూచీకత్తుల బజారు సోమవారం తీవ్ర ఒత్తిడికి లోనైంది. వరుస వృద్ధి తర్వాత వచ్చిన ఈ అకస్మాత్ పతనం మదుపర్లలో ఆందోళన రేకెత్తించింది. ఉదయం ట్రేడింగ్ ప్రారంభమైన వెంటనే ఒత్తిడి పెరిగి, బీఎస్ఈ సెన్సెక్స్ 803 పాయింట్లు కుప్పకూలి 84,909 కనిష్ట స్థాయిని తాకింది. అదే సమయంలో నిఫ్టీ 26,000 కీలక గడపను కోల్పోయి 25,902.95 వరకు పడిపోవడం గమనార్హం.

మధ్యాహ్నం ఒకటిన్నర గంటలకు సెన్సెక్స్ 790 పాయింట్ల నష్టంతో 84,921 వద్ద, నిఫ్టీ 270 పాయింట్లు తగ్గి 25,915 వద్ద కొనసాగింది. సూచీల మొత్తం దిశ దక్షిణదిశకే ఉండటంతో, ట్రేడింగ్ హాళ్లలో టెన్షన్ వాతావరణం నెలకొంది. సెన్సెక్స్‌లోని ముప్పై కంపెనీల్లో ఇరవై ఎనిమిది నష్టాల్లోనే ఉండటం మార్కెట్ బలహీనతను బహిర్గతం చేసింది.

బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, బిఎల్, టాటా మోటార్స్, స్టేట్ బ్యాంక్, టాటా స్టీల్, అదానీ పోర్టులు వంటి ప్రముఖ సంస్థల షేర్లు ఐదు శాతం వరకు కోల్పోయాయి. ఈ భారీ విక్రయాలతో రోజంతా సూచీలు ఒత్తిడిలోనే సాగాయి.

## ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి

– రీఓపెన్ కేసులను త్వరితగతిన పరిష్కరించండి
– జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా





మనగళం, నంద్యాల: ప్రజా పరిష్కార వేదికకు వచ్చే అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యతగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. కలెక్టర్ తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జిల్లా ఉన్నతాధికారులు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నమోదయ్యే ప్రతి అర్జీ ప్రజల నమ్మకానికి నిదర్శనమని. అందుచేత వాటిని అత్యంత ప్రాధాన్యంతో, నాణ్యతతో, నిర్ణీత వ్యవధిలో పరిష్కరించడం అధికారులు తమ బాధ్యతగా భావించాలని సూచించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను సమీక్షించిన కలెక్టర్, రీఓపెన్ అయిన 592 దరఖాస్తులను ఒక వారం రోజుల్లో పూర్తిస్థాయిలో క్లియర్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఎస్ఎల్ఏలో ఉన్న 1,797 దరఖాస్తులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పెండింగ్ అర్జీల ఆడిట్‌ను నిరంతర ప్రక్రియగా తీసుకోవాలని, ప్రతి దరఖాస్తు ప్రగతి దశను అధికారులు స్వయంగా పర్యవేక్షించి ఆలస్యానికి తావు లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు ఇచ్చిన ప్రతి విజ్ఞప్తిని సకాలంలో పరిష్కరించడం ద్వారా ప్రభుత్వంపై ప్రజా నమ్మకాన్ని మరింత బలపరచాలని కలెక్టర్ తెలిపారు.

## ఇంపాల్‌కు అదనపు విమాన సేవలు




ఇంపాల్, డిసెంబర్ 8 మనగళం,: ఉత్తరాది రాష్ట్రాల్లో ప్రయాణ సౌకర్యాలను మెరుగుపరిచే లక్ష్యంతో అలయన్స్ ఎయిర్ నిర్వహించిన అదనపు విమానాలకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అభినందనలు తెలిపింది. డిసెంబర్ 8న ఇంపాల్ నుండి గువాహాటి, ఇంపాల్ నుండి కొల్కతా మధ్య ప్రత్యేక విమానాలను నడపడం ప్రాంతీయ విమాన కనెక్టివిటికి మద్దతు ఇచ్చిన ముఖ్యమైన చర్యగా ప్రశంసించింది.

ఈ అదనపు సేవలు అత్యవసర సమయంలో అవసరమైన ప్రయాణీకుల రద్దీని తగ్గించడంలో, పూర్తి సామర్థ్యంతో ప్రయాణీకులను తరలించడంలో కీలక పాత్ర పోషించాయని వెల్లడించింది. ప్రయాణీకుల సౌకర్యం దృష్ట్యా తక్షణ స్పందన చూపిన అలయన్స్ ఎయిర్ చర్యలు ప్రాంతీయ వాయు రవాణాలో విశ్వసనీయతను పెంచాయని పేర్కొంది.

ప్రయాణీకుల సేవల బలోపేతం, విమాన కనెక్టివిటీలో నిష్పక్షపాత సేవలు అందించడం తన ప్రధాన లక్ష్యమని తెలిపింది. ముఖ్యంగా, ఉత్తరాది వంటి వ్యూహాత్మక ప్రాంతాల్లో విమాన మార్గాల బలోపేతం ప్రాంతీయ అభివృద్ధికి దోహదం చేస్తుందని పేర్కొంది. దేశవ్యాప్తంగా పౌర విమాన రవాణా సౌకర్యాలను మెరుగుపరచడం, ప్రయాణీకులకు విశ్వసనీయ సేవలను అందించడం కోసం భారత్ నిరంతరంగా కృషి చేస్తోందని స్పష్టం చేసింది.

# ఐగాట్ కర్మయోగి యాప్ తో ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధి

– జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



మనగళం, నంద్యాల : ప్రభుత్వ ఉద్యోగుల నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు ఐగాట్ కర్మయోగి యాప్ ముఖ్య భూమిక పోషిస్తోందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశ భవనంలో ప్రజా అర్జీల స్వీకరణ అనంతరం పలు శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో డిఆర్ఓ రాము నాయక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు అవసరమైన ప్రవర్తనా నియమాలు, సిసిఎ రూల్స్ వంటి కోర్సులు ఈ యాప్ ద్వారా వీడియో రూపంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీడియోలు చూసిన తర్వాత వచ్చే ప్రశ్నావళికి సమాధానాలు ఇస్తే ఉద్యోగి పేరుతో సర్టిఫికెట్ జారీ అవుతుందని చెప్పారు. ఈ అంశంపై రానున్న కలెక్టర్ల సమావేశంలో కూడా చర్చ జరగనున్నందున, జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులందరూ ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసి ప్రయోజనం పొందాలని సూచించారు. రానున్న రోజుల్లో ఐగాట్ కర్మయోగి యాప్‌లో ఉద్యోగుల పురోగతిని సిఎఫ్ఎంఎస్ ఐడీలకు అనుసంధానం చేయడంతో పాటు, వార్షిక ఇంక్రిమెంట్ల మంజూరుపై కూడా ఇది ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికే పంచాయతీ రాజ్ ఈఈ, ఎక్సైజ్ సూపరింటెండెంట్, డిఈఓ అత్యధిక కోర్సులు పూర్తి చేయడం ద్వారా మంచి ప్రదర్శన కనబర్చారని వారికి అభినందనలు తెలిపారు.

కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లు %-% పెండింగ్ నివారణకు సూచనలు: కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ (కేపీఐఎస్) అప్డేట్ విషయంలో మార్కెటింగ్ శాఖకు సంబంధించిన 3, పోలీసు శాఖకు 12, విద్యుత్ శాఖకు 3, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ శాఖకు 3 పెండింగ్‌లో ఉన్నాయని గుర్తించిన కలెక్టర్, వీటిని అత్యవసరంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ప్రభుత్వ కార్యాలయాలన్నీ వందశాతం ఈ%-%ఆఫీస్ అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. అన్ని ఉత్తరాలు, ప్రత్యుత్తరాలు ఈ%-%ఆఫీస్ ద్వారానే పంపించాలని, ముఖ్యంగా రెవెన్యూ విభాగంలోని ఆర్డీఓలు, తహసీల్దార్లు ఈ%-%ఆఫీస్‌ను సమర్థంగా వినియోగించడం ద్వారా కాగితరహిత కార్యాలయాలుగా రూపుదిద్దుకోవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు సర్వే శాఖ ద్వారా లక్షకు పైగా, కలెక్టరేట్ ద్వారా 55 వేల డాక్యుమెంట్లు ఏజెంట్ స్పేస్‌లో అప్లోడ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అయితే ఇరిగేషన్, రిజిస్ట్రేషన్, దేవాదాయ, వాణిజ్య పన్నులు, కాలుష్య నియంత్రణ, విద్యా శాఖ, టౌన్ ప్లానింగ్, మైనారిటీ సంక్షేమం తదితర శాఖలు ఏ ఒక్క డాక్యుమెంట్ కూడా అప్లోడ్ చేయకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే చర్యలు తీసుకుని పెండింగ్‌ను క్లియర్ చేయాలని ఆదేశించారు. అపార్ ఐడీల సక్రమ అభివృద్ధి అత్యంత ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. మహానంది, పగిడ్యాల, బేతంచర్ల, జూపాడుబంగ్లా, శ్రీశైలం మండలాల్లో పురోగతి చాలా తక్కువగా ఉందని వెల్లడించారు. విద్యాశాఖ 95 శాతం, ఇంటర్మీడియట్ శాఖ 90 శాతం లక్ష్యాన్ని సాధించేందుకు మరింత కృషి చేయాలని సూచించారు.

## విద్యుత్ బిల్లు, విత్తన బిల్లుల జీఓ కాపీల దగ్ధంలిఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రుడు




మన గళండోన్ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో విద్యుత్ బిల్లు 2025, విత్తన బిల్లు 2025ను ఆమోదించేందుకు ప్రతిపాదనలు తెచ్చింది. ఈ రెండు బిల్లులు వ్యవసాయ రంగం మీద తీవ్రమైన ప్రతికూల ప్రభావం వేస్తాయి. రైతు వ్యతిరేకమైన ఈ రెండు బిల్లుల ప్రతులను దేశావ్యాపితంగా అన్ని గ్రామాలలో దగ్ధం చేయవలసిందిగా అఖిల భారత కిసాన్ సభ, సంయుక్త కిసాన్ మోర్చ పిలుపు ఇచ్చాయి.అందులో భాగంగా ఈ రెండు బిల్లులకు సంబంధించిన ప్రతులను ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో దగ్ధం చేయడం జరిగిందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రుడు, ఉపాధ్యక్షులు సుబ్బా రాయుడు తెలిపారు. అనంతరం ఈకార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ

విద్యుత్ బిల్లు 2025ను చట్ట రూపంలోకి తెచ్చి దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగంలో ఉన్న విద్యుత్ పంపిణీ సంస్థలను ప్రైవేట్ పరం చేసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును తీసుకు వస్తున్నది. 2025 శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో ఈ బిల్లును పార్లమెంటులో ఆమోదం చేయించుకోవాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. ఈ బిల్లు చట్ట రూపం దాలిస్తే వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు ఉండదు. దళిత, గిరిజన సామాజిక తరగతులకు, చిన్న పరిశ్రమలకు ఇచ్చే విద్యుత్ రాయితీ రద్దు అవుతుంది. గృహ వినియోగదారులపై ఇప్పటికే ఉన్న విద్యుత్ భారాలకు అదనంగా మరింతగా విద్యుత్ ఛార్జీలు పెరిగే ప్రమాదం ఉన్నది.

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన విత్తనబిల్లు 2025 పూర్తిగా ప్రైవేటు, కార్పొరేట్ విత్తన కంపెనీలకు అనుకూలంగాను, రైతులకు, రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగాను ప్రతిపాదించబడింది. ఈ బిల్లు చట్టం రూపంలోకి వస్తే భారత వ్యవసాయానికి కీలకమైన విత్తనాలపై ప్రైవేట్, కార్పొరేట్ కంపెనీల పెత్తనం పెరుగుతుంది. నకిలీ విత్తనాలు, కల్తీ విత్తనాలకు రైతులు నష్టపోతే ఎలాంటి బాధ్యత విత్తన కంపెనీలకు ఉండదు. ఆ రకంగా రైతుల ప్రయోజనం కంటే విత్తన కంపెనీల ప్రయోజనం కొరకే ఈ చట్టం తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది.అందుకని దేశవ్యాప్తంగా విత్తన బిల్లు 2025, విద్యుత్ బిల్లు 2025 ప్రతులను దగ్ధం చేసే కార్యక్రమం అన్ని గ్రామాలలో విస్తారంగా నిర్వహించాలని, నిరసన కార్యక్రమాల్లో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని వారన్నారు. రాబోవు రోజులలో కలిసివచ్చే అన్ని రైతు సంఘాలను, రైతులను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలోరైతు సంఘం మండల నాయకులు నాగ మద్దయ్య, కొండయ్య, సీఐటీయు నాయకులు భాస్కర్ రెడ్డి, శివరాం, మాణిక్యం శెట్టి, రామాంజనేయులు, నక్కీ శ్రీకాంత్, మద్దయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయ సేవల్లో పురోగతి సాధించాలి

– స్క్రబ్ టైఫస్‌పై గ్రామ స్థాయిలో అవగాహన తప్పనిసరి – జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




మనగళం, నంద్యాల : జిల్లాలోని సచివాలయాల ద్వారా మెరుగైన సేవలు అందించి పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఈఓఆర్డిలతో గ్రామ సచివాలయ సర్వీసులు, స్వామిత్వ పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో డీఎల్డీఓ శివారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి లలితాబాయి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సిటిజన్ ఈ-కెవైసీ విషయంలో నంద్యాల (అర్బన్), పాములపాడు, పగిడ్యాల, కొత్తపల్లి, బండి ఆత్మకూరు, కొలిమిగుండ్ల, సిరివెళ్ల, చాగలమర్రి, బనగానపల్లె (రూరల్), ఆత్మకూరు మండలాల్లో పురోగతి తగ్గిందని, ఈ నెల 12లోపు పెండింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. చిల్డ్రన్ వితౌట్ ఆధార్ నమోదు విషయంలో రుద్రవరం, బండి ఆత్మకూరు మండలాల్లో అధిక పెండింగ్ ఉన్నందున మహిళా కార్యదర్శులతో సమన్వయం చేసి త్వరగా పూర్తిచేయాలని సూచించారు. పాన్ అప్డేషన్‌లో నంద్యాల (అర్బన్), కొలిమిగుండ్ల, మహానంది, ఉయ్యాలవాడ మండలాల్లో పెండింగ్ ఉన్నదని, లక్ష్యాన్ని సమయానికి పూర్తి చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది హాజరు శాతాన్ని మెరుగుపరచాలని, రీవెరిఫికేషన్ ఆఫ్ జియో కోఆర్డినేట్స్‌లో ఇంకా 971 పెండింగ్ ఉన్నందున వాటిని పూర్తిచేసి జిల్లాను మంచి స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. జియో కోఆర్డినేట్స్, కౌశలం, మ్యాండేటరీ బయోమెట్రిక్స్ వంటి అంశాల్లో వందకు వంద శాతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తల్లికి వందనం పథకంలో నగదు జమ కాకుండా ఉన్న అర్హులకు ఎన్పిసిఐ ఖాతాలు తెరిపించి చెల్లింపులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందులో నంద్యాల (అర్బన్), సిరివెళ్ల, డోన్, బనగానపల్లె మండలాల్లో పురోగతి తక్కువగా ఉందని పేర్కొన్నారు. మున్సిపల్ పరిశీలనలో స్వచ్ఛమైన తాగునీరు అందించే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. స్క్రబ్ టైఫస్ వ్యాధి వ్యవసాయ క్షేత్రాల్లో ఉండే సూక్ష్మ కీటకం కాటు వల్ల వస్తుందని, చర్మంపై నల్ల మచ్చ, దద్దుర్లు, తీవ్రమైన జ్వరం, నీరసం, తలనొప్పి, వణుకు, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయని కలెక్టర్ వివరించారు. ఈ వ్యాధిని ఎలిసా పరీక్ష ద్వారా నిర్ధారించవచ్చని, నిర్ధారణ అనంతరం డాక్సీసైక్లిన్, ఏజిథ్రమైసిన్ టాబ్లెట్లతో చికిత్స పొందవచ్చని తెలిపారు. మండల స్థాయిలో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని వైద్యాధికారులకు సూచించారు. స్వామిత్వా వెక్టరైజేషన్ ప్రక్రియను నిష్పత్తి తగ్గకుండా వేగంగా పూర్తిచేయాలని, 9(2) నోటీసులను త్వరగా అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. పగిడ్యాల, గోస్పాడు, బనగానపల్లె, బండి ఆత్మకూరు మండలాల్లో పురోగతిని సాధించాలన్నారు.

# 13న జాతీయ లోక్ అదాలత్



మనగళం, కర్నూలు సిటీ : జిల్లాలోని అన్ని కోర్టు ప్రాంగణాలలో ఈ నెల 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ ఉంటుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి బి.లీలా వెంకట శేషాద్రి తెలిపారు. జిల్లా న్యాయ సేవా సదన్ లో సోమవారం ఆయన మునిసిపల్, సచివాలయం అధికారులతో జాతీయ లోక్ అదాలత్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా బి.లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ కోర్టులలో ఉన్న సివిల్ కేసులు, భూ సేకరణ కేసులు, టాక్స్ కేసులు త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి రోజు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కోర్టుల నందు ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్ జరుగుచున్నాయని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని కక్ష దారులు తమ కేసులను ఈ లోక్ అదాలత్ లో రాజీపూర్వకంగా పరిష్కరించుకేనే చైతన్య పరచాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు పరిష్కరించేల ప్రత్యేక దృష్టి సారించి, విజయవంతం అయ్యేలా కృషి చేయాలని కోరారు.

# వైభవంగా స్వర్ణరథోత్సవం



మనగళం శ్రీశైలం : ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈ రోజు (07.12.2025) శ్రీస్వామిఅమ్మవార్లకు స్వర్ణరథోత్సవం నిర్వహించబడింది. కాగా ఆరుద్రోత్సవంలో భాగంగా ఈ రోజు వేకువజామున శ్రీస్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి. అనంతరం స్వర్ణరథోత్సవం జరిపించబడింది. ఈ స్వర్ణరథోత్సవంలో ముందుగా దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, అతివృష్టి అనావృష్టి నివారించబడాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలని, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ ఆలయ అర్చకులు లోకకల్యాణానికాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. తరువాత రథారూఢులైన శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలు జరిపించబడ్డాయి.

అనంతరం భక్తుల శివనామస్మరణతో వేదమంత్రాల నడుమ ఉదయం గం.7.00లకు ఈ స్వర్ణరథోత్సవం ప్రారంభమైంది. గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు తిరిగి అక్కడి నుండి నంది మండపం వరకు ఈ రథోత్సవాన్ని జరిపించడం జరిగింది. సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా రథోత్సవంలో పలు కళా బృందాల కోలాటం, డోలు వాయిద్యం మొదలైన జానపద కళారూపాలు కూడా ఏర్పాటు చేయబడ్డాయి. అదేవిధంగా రథోత్సవంలో సంప్రదాయ నృత్యం, ఏర్పాటు చేయబడింది. ఈనాటి స్వర్ణరథోత్సవంలో కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీ ఎ.వి.రమణ, శ్రీమతి జి. గంగమ్మ, శ్రీ డి. వెంకటేశ్వర్లు, ప్రత్యేక ఆహ్వానితులు వేమిరెడ్డి కోటారెడ్డి, అర్చకస్వాములు, పలువిభాగాల అధికారులు, పర్యవేక్షకులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# లోకకల్యాణార్థం పంచమఠాలలో పూజాదికాలు

మనగళం శ్రీశైలం : లోక కల్యాణార్థం పంచమఠాలలో ఈ రోజు (08.12.2025) ఉదయం విశేషంగా అభిషేకం, పుష్పార్చనలు జరిపించబడ్డాయి. ముందుగా ఘంటామఠంలో ఆ తరువాత వరుసగా భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధర మఠాలలో ఈ పూజాదికాలు జరిపించడం జరిగింది. కాగా ఈ రోజు జరిగిన విశేషపూజాదికాలలో ముందుగా అర్చకస్వాములు లోకకల్యాణ సంకల్పాన్నిపఠించారు. ఈ సంకల్పంలో దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలనీ, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలనీ, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని ఘంటామఠంలోని గణపతికి పూజాదికాలు నిర్వహించబడ్డాయి. తరువాత అన్ని మఠాలలో సంప్రదాయబద్ధంగా అభిషేకాది అర్చనలను నిర్వహించబడ్డాయి. కాగా శ్రీశైల సంస్కృతిలో చాలాకాలం పాటు మఠాలు ప్రధానపాత్ర పోషించాయి. ప్రస్తుత సాధారణశకం 7వ శతాబ్దం నుంచి నిర్మించబడ్డ ఈ మఠాలు, గర్భాలయం, అంతరాలయం, ముఖమండపం లాంటి నిర్మాణాలను కలిగివుండి, చూడటానికి ఆలయాల మాదిరిగానే కనిపిస్తాయి. కొన్ని శతాబ్దాల నుండి కూడా ఈ మఠాలన్నీ క్షేత్ర ప్రశాంతతలోనూ, ఆలయ నిర్వహణలోనూ, ఆధ్యాత్మికపరంగా, భక్తులకు సదుపాయాలను కల్పించడంలోనూ ప్రధాన భూమికను వహించాయి. శ్రీశైలంలో కొన్ని మఠాలు కాలగర్భములో కలిసిపోగా, ప్రస్తుతం



ఆలయానికి దగ్గరలో వాయువ్య భాగాన ఘంటామఠం, భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధరమఠం అనే మఠాలు పంచమఠాలనే పేర్లతో పిలువబడుతున్నాయి. కాగా శిథిలావస్థలో ఉన్న ఈ మఠాలలో ఘంటామఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠాలను దేవస్థానం పూర్తిగా పునరుద్ధరించింది. ప్రాచీన నిర్మాణశైలికి ఎలాంటి విఘాతం కలుగకుండా ఈ పునర్నిర్మాణ పనులు పూర్తి చేయబడ్డాయి. అదేవిధంగా భీమశంకర మఠానికి తగు మరమ్మతులు కూడా చేయబడ్డాయి. ఈ మఠాలలోని దేవతామూర్తులకు నిత్యధూపదీప నివేదన కైంకర్యాలు జరిపించడం జరుగుతుంది.

# ఉమామహేశ్వరకళాక్షేత్రం, విజయవాడ వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన.

మనగళం శ్రీశైలం : దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈ రోజు (07.12.2025) శ్రీ ఉమామహేశ్వరకళాక్షేత్రం, విజయవాడ వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమములో వినాయకకౌత్వం, మూషికవాహన, శివాష్టకం, నమశ్శివాయతే, శివపంచాక్షరి, గరుడ గమన తదితర గీతాలకు హర్షిణీ, చైత్ర, బిందు, సువర్చల, లిఖిల, రోహిణి, తదితరులు నృత్యప్రదర్శన చేయనున్నారు. కాగా ఈ నిత్య కళారాధనలో ఆయా రోజులలో హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.



# 20 లక్షల ఉద్యోగాలు కల్పించేలా చర్యలు

**– మంత్రి టి.జి.భరత్**

మనగళం, కర్నూలు సిటీ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని యువతకు ఎన్నికల సమయం లో ఇచ్చిన వాగ్దానం మేరకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం కర్నూలు కేవీఆర్ కళాశాల లో రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన జాబ్ మేళాను మంత్రి టి.జి. భరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కర్నూలు సెయింట్ జోసెఫ్ కళాశాలలో గతం లో ఏర్పాటు చేసిన జాబ్ మేళాలో 950 మంది పైగా ఉద్యోగాలు సాధించారని, ఇప్పుడు 1,550 ఉద్యోగాలను 21 సంస్థల ద్వారా కల్పించే చర్యలు చేపడుతున్నామన్నారు. ఇపుడు వస్తున్న అవకాశాన్ని వెంటనే అందిపుచ్చుకొని ఉద్యోగంలో చేరి మీ నైపుణ్యాన్ని పెంచుకోవాలని మంత్రి సూచించారు. ఓర్వకల్ హబ్ లో పదివేల కోట్ల పెట్టుబడులతో కంపెనీలు వస్తున్నాయని, వాటిలో ఉద్యోగాలు సంపాదించడానికి విద్యార్హతతోపాటు నైపుణ్యం ఉండాలన్నారు. ఆదిశగా విద్యార్థులు అడుగులు వేసి ఉద్యోగాలు సాధించాలని మంత్రి తెలిపారు. 500 కోట్ల రూపాయల పెట్టుబడితో డ్రోన్ పరిశ్రమ, ఫైవ్ స్టార్ హెూటల్ వస్తున్నాయని, వీటికి సంబంధించిన నైపుణ్యం యువతకు కలిగి ఉండాలని సూచించారు. త్వరలో నైపుణ్య శిక్షణ కు సంబంధించిన సంస్థ ను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. భవిష్యత్తులో యువత మన దగ్గర ఉన్న పరిశ్రమల అవసరాలకు తగ్గట్టు విద్యార్హతలు , నైపుణ్యాలు సాధించాలని సూచించారు. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ అహర్నిశలు యువత కు ఉద్యోగాలు ఏర్పాటు చేసే ఆలోచనలతో ఉంటారని తెలిపారు. ఈ



సందర్భంగా మైక్రోసాఫ్ట్ ఆఫీస్ కోర్సును పూర్తి చేసుకున్న విద్యార్థులకు మంత్రి టి.జి. భరత్ సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. అంతకుముందు కళాశాల లో పోలీసు శాఖ ఏర్పాటుచేసిన కర్నూలు నగర ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను మంత్రి పరిశీలించారు. కళాశాల ఎన్ సీపీ విద్యార్థినులు నిర్వహించిన పెరేడ్ పరిశీలించారు. గౌరవ వందనాన్నిమంత్రి స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ దీప్తి, స్కిల్ డెవలప్మెంట్ అధికారి ఆనంద్ రాజకుమార్, కేవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ కొండయ్య, బొందెల కార్పొరేషన్ చైర్మన్ విక్రమ్ సింగ్, స్పార్క్ ఇంచార్జ్ గిరిరాజ్, రవి పాల్గొన్నారు.

# రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘం ఉద్యోగుల రిలే నిరాహార దీక్ష

మన గళం కోడుమూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల ఆధ్వర్యంలో కోడుమూరు నందు కోట్ల విజయభాస్కర్ రెడ్డి సర్కిల్ దగ్గర రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కారం కోరుతూ జీవో నెంబర్ 36 వెంటనే అమలుపరిచి 2019 2024 తాలూకు పెండింగ్లో ఉన్న వేతన సవరణలు చేసి అప్పటి వరకు మధ్యాంతర మృతి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు ఉద్యోగులకు చెల్లించే గ్రాట్యూట్ సీలింగ్ విధించి రెండు లక్షల మాత్రమే చెల్లిస్తున్నారు దయచేసి గ్రాట్యూటీ చట్టాన్ని అమలుపరిచి చట్ట ప్రకారం గ్రాట్యుటీ చెల్లింపు చేయాలని వారు డిమాండ్ చేశారు సహకార సంఘాలతో పనిచేసే ఉద్యోగులు కూడా ప్రభుత్వ ఉద్యోగులు అమలు అయ్యే రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలు అమలు పరచాలని వారు కోరారు ఉద్యోగులకు ఐదు లక్షలు తక్కువ కాకుండా ఆరోగ్య భీమా కల్పించి ఉద్యోగి సర్వీస్ లో మరణిస్తే ఆ కుటుంబానికి ఆధారం లేకుండా పోతున్నందున ప్రతి ఉద్యోగి 20 లక్షలు టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీ చేయించి కుటుంబాలకు భరోసా కల్పించాలని వారు ఈ సందర్భంగా ప్రభుత్వానికి డిమాండ్ చేశారు అనేక సంఘాలలో ఉద్యోగుల జీతాలను డ్యూటు నందు ఉంచడం జరిగింది. ఉద్యోగులు డ్యూటు పద్దులను రద్దు చేయాలని అలాగే 2019 తర్వాత సంఘాల్లో చేరిన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని వారు డిమాండ్ చేశారు పి పి సి ఎస్ కాకుండా జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల ద్వారా రైతులకు రుణాలు ను డైరెక్ట్ గా ఇస్తున్నారు దీనివలన రైతులకు సరైన సమయంలో అప్పు దొరక్కపోవడమే కాకుండా ఆ ఏరియా పిఎసిఎస్ నిర్వీర్యం అయిపోవు చిన్నవని ఈ విధానాన్ని మార్పు చేసి అన్ని సేవలు సహకార సంఘాల ద్వారా రైతులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు రైతులకు ప్రతి సంవత్సరం వారు చెల్లించిన షేరు ధనాలపై డివెండెంట్ లేదా కనీసం 6% వడ్డీ చెల్లించాలి వెంటనే దీనిపై చర్య తీసుకొని 2011 వ సంవత్సరం నుండి చెల్లించవలసిన డివిడెంట్ లేదా వడ్డీ చెల్లించి రైతులకు న్యాయం చేయాలని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు ఇప్పటికైనా స్పందించి మా యొక్క డిమాండ్లన్నింటినీ అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు



Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP. Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.